ప్రజాశక్తి
బుధవారం 16 అక్టోబర్ 2024
8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి

భూమీలేదు.. బతికే మార్గమూలేదు

◆ నమ్మి మోసపోయిన రైతులు ◆ పనిచేసే కంపెనీలో కరువైన భద్రత
◆ సెజ్‌లో అభిజిత్ ఫెర్రో టెక్ మూతతో కార్మికుల్లో ఆందోళన

అభిజిత్ ఫెర్రో టెక్ కంపెనీ ఎదుట ఆందోళనకు దిగిన కార్మికులు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

అచ్యుతాపురం మండలం, చిప్పాడ పంచాయతీ, తలదిబ్బకు చెందిన రాజాన రాము కుటుంబానికి 19 ఎకరాల భూమి వుండేది. నలుగురు అన్నదమ్ములు కలిసి వ్యవసాయం చేసుకొని బతికేవారు. వ్యవసాయ పనులకు తమ కుటుంబ సభ్యులతో పాటు అవసరమైనప్పుడు కూలీలను పెట్టుకొని వ్యవసాయం చేసుకునేవారు. సెజ్‌కు భూములు తీసుకున్నాక వీరి బతుకు ఒక్కసారి తిరగబడింది. ఎకరాకు రూ.2.90 లక్షల చొప్పున 19 ఎకరాలకు చెల్లించిన సొమ్మంతా ఖర్చయిపోయింది. వ్యవసాయ భూమి చేతిలో లేకుండా పోయింది. కూలీలను పెట్టుకొని వ్యవసాయం చేసుకొనే ఆ రైతు ఇప్పుడు అచ్యుతాపురం ఎస్ఇజెడ్‌లోని అభిజిత్ ఫెర్రోటెక్ కంపెనీలో కార్మికునిగా పనిచేస్తున్నాడు. కుటుంబం గడవక ఆయన భార్య ఆర్.రామలక్ష్మి కంపెనీ కార్యాలయంలో చిన్నపాటి పనిచేస్తోంది. ఇద్దరూ కలిసి కంపెనీలో పనిచేసి ఆడపిల్లను చదివించుకుంటున్నారు. ఇక్కడ రాము జెసిబి మెకానిక్‌గా పనిచేస్తుంటే, వారి ముగ్గురు సోదరుల్లో ఇద్దరు కళాసీ పనిచేస్తున్నారు. కంపెనీ మూసేయడంతో తామెలా బతకాలోనని ఇప్పుడు వారంతా తల్లడిల్లుతున్నారు.

సోమవారం అభిజిత్ ఫెర్రోటెక్ కంపెనీని మూసేయడంతో రాము, రామలక్ష్మి వంటి అనేక కుటుంబాలు బతుకు కోసం వెతుకులాడాల్సివస్తోంది. చెమటలు పట్టిన ముఖాలతో కంపెనీ గేట్ల ముందు కార్మికులు నిలబడటం పలువురిని కలిచివేసింది. తామెలా బతకాలన్న ప్రశ్నలు కార్మికుల చుట్టూ తిరుగుతున్నాయి. పరిశ్రమల కోసం భూములిస్తే రైతు బతుకు మారదన్న నిజం రైతుకు అర్థమవుతోంది. ఒక్కో పరిశ్రమ ద్వారా ఒక్కో వాస్తవం బయటపడుతోంది. పరిశ్రమాధిపతులపై ప్రభుత్వం చూపుతున్న జాలి భూములు కోల్పోయిన బాధిత రైతులు, పేదలపై చూపడంలేదు. సెజ్‌లో భూమంతా పోయాక కుటుంబాలను, ఊరును విడిచివెళ్లలేక కొద్దిపాటి జీతాలకు ఇక్కడి వారంతా అభిజిత్ ఫెర్రోటెక్‌లో ఉపాధి కోసం పనిలో చేరారు. మునగపాక, కశింకోట మండలాల నుంచి వెయ్యి మంది కార్మికులు ఈ కంపెనీలో పనిచేస్తున్నారు. చట్ట విరుద్ధంగా ఫెర్రో టెక్ మిగతా 2లో..

శభాష్..!

◆ నెహ్రూ నగర పాలక ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రతిభకు కలెక్టర్ కితాబు
◆ ఇంకా బాగా చదివి.. ఉన్నత స్థానాలకు చేరుకోవాలని అభిలాష

విద్యార్థుల పఠనా సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - సీతమ్మధార : స్థానిక నెహ్రూ నగర పాలక ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులు ప్రదర్శించిన పఠనా సామర్థ్యాలను, ఆంగ్లంలో మాట్లాడిన తీరును, గణితంలో వారు చూపిన ప్రతిభను చూసి జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ మురిసిపోయారు. 'శభాష్.. ఇంకా బాగా చదువుకుని.. ఉన్నత స్థానాలకు చేరుకోవాలి' అని ఆకాంక్షించారు. అన్నింటా విద్యార్థుల ఉత్సాహం చూసిన ఆయన 'గుడ్ కీప్ ఇట్ అప్' అని కితాబిచ్చారు. సీతమ్మధార పరిధి పి అండ్ టి కాలనీలోని నెహ్రూ నగర పాలక ఉన్నత పాఠశాలను మంగళవారం ఉదయం కలెక్టర్ సందర్శించి అక్కడి పరిస్థితులను నిశితంగా గమనించారు. పదో తరగతి విద్యార్థుల గదికి వెళ్లి వారితో కాసేపు మాట్లాడారు. ఇప్పటి వరకు అయిన సిలబస్‌పై కొన్ని పాఠ్యాంశాలను విద్యార్థులచే చదివించారు. పలు కోణాల్లో ప్రశ్నలు సంధించారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, బాధ్యతగా నడుచుకుంటూ ప్రణాళిక ప్రకారం బాగా చదువుకోవాలని సూచించారు. ఆంగ్లం, హిందీపై పట్టు సాధించాలని చెప్పారు. పదో తరగతి తర్వాత జరిగే పోటీ పరీక్షల్లో సత్తా చాటాలన్నారు. విద్యార్థుల్లోని ఆసక్తిని గమనించి పఠనా సామర్థ్యాలను మరింత పెంచాలని, చదివిన అంశాలను సులభంగా అర్థం చేసుకునేలా, దీర్ఘకాలం గుర్తు పెట్టుకునేలా మెళకువలు నేర్పించాలని ఉపాధ్యాయులను, విద్యా శాఖ అధికారులను ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశించారు. అనంతరం అదే పాఠశాలలో మధ్యాహ్న భోజన పథక అమలు తీరును పరిశీలించారు. అక్కడ తయారు చేసిన ఆహారాన్ని రుచి చూశారు. ఈ క్రమంలో భోజనం తయారు, సరుకుల వినియోగం, ఇతర అంశాలపై నిర్వాహకులతో మాట్లాడారు. ఆయన వెంట జిల్లా విద్యాశాఖ అధికారిణి ఎల్.చంద్రకళ, ఇతర విద్యాశాఖ అధికారులు ఉన్నారు.

యుపిహెచ్‌సి, అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలు

పాత రేసపువానిపాలెం పరిధిలోని యుపిహెచ్‌సిని కలెక్టర్ మిగతా 2లో..

యువతలో నైపుణ్యాలు వెలికితీతకు ప్రత్యేక శ్రద్ధ

వార్త 3లో..

తండ్రిని హత్యచేసిన కొడుకు

వార్త 3లో..

జలాశయాల అభివృద్ధికి రూ.7.11 కోట్ల నిధులు

వార్త 5లో..

ఇన్‌ఛార్జి మంత్రులుగా డోలా, కొల్లు

బాల వీరాంజనేయ స్వామి ఆంధ్ర మెడికల్ కాలేజీ విద్యార్థే

బాల వీరాంజనేయస్వామి

కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ, వికలాంగ, వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, అనకాపల్లి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా కొల్లు రవీంద్ర నియమితులయ్యారు.

ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా బాల వీరాంజనేయ స్వామికి విశాఖపట్నంతో ఎంతో అనుబంధం ఉంది. ఆయన ఇక్కడ ఆంధ్ర మెడికల్ కాలేజీలోనే చదువుకున్నారు.

నేడు జెడ్‌పి స్థాయీ సంఘ సమావేశాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలను బుధవారం నిర్వహించనున్నట్లు జెడ్‌పి సిఇఒ పి.నారాయణ మూర్తి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లా జెడ్‌పి చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన 1 నుంచి 7 వరకూగల స్థాయీ సంఘ సమావేశాలు వేర్వేరుగా ఉదయం 10 నుంచి 12 గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. 2, 5వ స్థాయీ సంఘ సమావేశాలు ఉదయం 10 గంటలకు, 4, 3వ స్థాయీ సంఘ సమావేశాలు 11 గంటలకు, 1, 6, 7వ స్థాయీ సంఘ సమావేశాలు 12 గంటలకు జరుగాయని తెలిపారు. స్థాయీ సంఘ సభ్యులంతా సకాలంలో హాజరు కావాలని కోరారు.

బాధ్యతలు చేపట్టిన పరమేష్ శివమణి

ఐసిజి డైరెక్టర్ జనరల్‌గా పరమేష్ శివమణి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇండియన్ కోస్ట్ గార్డ్ (ఐసిజి) 26వ డైరెక్టర్ జనరల్‌గా పరమేష్ శివమణి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఫ్లాగ్ ఆఫీసర్‌గా ఆయన మూడున్నర దశాబ్దాలకుపైగా తీర ప్రాంతంలో వివిధ హోదాల్లో పనిచేశారు. నావిగేషన్ అండ్ డైరెక్షన్‌లో ఆయన స్పెషలైజేషన్ కలిగి మిగతా 2లో..

కూటమి నాయకుల

ఆదాయం పెంపునకే కొత్త మద్యం దుకాణాలు

మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విమర్శ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రభుత్వ ఆదాయానికి పెద్ద ఎత్తున గండి కొట్టి, టిడిపి కూటమి నాయకుల ఆదాయం పెంపునకు దాదాపు అన్ని వైన్‌షాప్‌లనూ వారికే కేటాయించారని వైసిపి మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఇక విచ్చలవిడిగా మద్యం, బెల్ట్‌షాప్‌లు వెలుస్తాయని అన్నారు. మంగళవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన అనంతరం మీడియాతో కాసేపు మాట్లాడారు. చంద్రబాబు ఎన్నికల ముందు సంపద సృష్టి అని చెప్పారని, అప్పట్లో అందరూ రాష్ట్రానికి ఆయన సంపద సృష్టిస్తారని అనుకున్నారని, కానీ మద్యం పాలసీ, వైన్‌షాప్‌ల కేటాయింపు చూసిన తర్వాత వాస్తవ పరిస్థితి అందరికీ అర్థమైందని అన్నారు. ఈ నెల 14న జరిగిన మద్యం షాప్‌ల కేటాయింపుల్లో అన్ని చోట్లా టిడిపి నాయకులు, కార్యకర్తలు, కూటమి ప్రజా ప్రతినిధులకే ఎక్కువ షాప్‌లు దక్కాయని అన్నారు. రాష్ట్రంలో ఇదో పెద్ద కుంభకోణమన్నారు. 2019లో తాము అధికారంలోకి రాగానే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 43 వేల బెల్టుషాప్‌లను రద్దు చేశామని, అలాగే 4500 వైన్‌షాప్‌లు ఉంటే వాటిని 2900కి తగ్గించామని, ఆ విధంగా పేద కుటుంబాలను రక్షించి, వారిని మద్యం బారి నుంచి కాపాడాలని చూశామని అమర్‌నాథ్ చెప్పారు. నాడు వాలంటీర్ల ద్వారా ఇంటింటికీ ప్రభుత్వ సేవలు అందిస్తే ఇప్పుడు చంద్రబాబు ఇంటింటికీ మద్యం పంపిణీ పథకాన్ని ప్రవేశపెట్టారని ఎద్దేవా చేశారు. రానున్న రోజుల్లో వీధికో బెల్టు షాప్ ఉంటుందని, అలాగే ఇంటికే మద్యం సరఫరా మొదలుపెడతారని తెలిపారు. కీలకమైన విద్య, వైద్య రంగాలను పూర్తిగా పక్కన పెట్టేసి వాటికి బదులు మద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఆక్షేపించారు. వెంటనే మద్యం పాలసీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్ణయాన్ని మార్చుకోకపోతే ప్రజల పక్షాన పోరాడతామని ప్రకటించారు. మద్యంపై పేదలు తిరగబడతారని అన్నారు.

కక్షతోనే వైసిపి నేతలపై తప్పుడు కేసులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాజకీయ దురుద్దేశంతోనే టిడిపి కూటమి ప్రభుత్వం కక్ష సాధింపుతో వైసిపి నేతలపై తప్పుడు కేసులు పెడుతోందని మాజీ మంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్‌నాథ్ విమర్శించారు. పశ్చిమ నియోకవర్గం 60వ వార్డు కార్పొరేటర్ పివి.సురేష్‌పై రౌడీ షీట్ ఓపెన్ చేసినందుకు నిరసనగా మంగళవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఫ్లకార్డులతో వైసిపి నేతలు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మీడియాతో మాట్లాడుతూ తప్పుడు కేసులు పెట్టి బెదిరించి వైసిపి నేతలను టిడిపిలో చేర్చుకోవాలని చూస్తున్నారన్నారు. టిడిపి నేతల కేసులకు తాము భయపడేది లేదని స్పష్టం చేశారు. టిడిపి నేతల అరాచకాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామన్నారు. తప్పుడు కేసులను న్యాయపరంగా ఎదుర్కొంటామని తెలిపారు. పోలీసులు టిడిపి నేతల దగ్గరికి వెళ్లి రాజీ చేసుకోవాలని చెబుతున్నారని, టిడిపి నేతలు సినిమా పోలీసుల్లా తయారయ్యారని ఎద్దేవా చేశారు. పివి.సురేష్ ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారని, ఆయనపై రౌడీషీట్ ఓపెన్ చేయడాన్ని ఖండిస్తున్నామని అన్నారు. ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మాట్లాడుతూ రాష్ట్రంలో రెడ్ బుక్ పాలన సాగుతోందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి వైసిపి నాయకులను టార్గెట్ చేస్తూ తప్పుడు కేసులు బనాయిస్తూ శునకానందం పొందుతోందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్ కుమార్, మళ్ల విజయ్ ప్రసాద్, డిప్యూటీ మేయర్ కట్టమూరి సతీష్, బాణాల శ్రీను, జాన్ వెస్లీ పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న అమర్‌నాథ్, వైసిపి నాయకులు

మొదటి పేజీ తరువాయి..

భూమీలేదు.. బతికే మార్గమూలేదు

యాజమాన్యం కంపెనీని మూసేయడంతో వెయ్యి మంది కార్మికులకు ఉపాధి పోయింది. సెజ్‌లో భూములు కోల్పోయిన రైతుల్లో అత్యధికులు అభిజిత్ ఫెర్రో టెక్ కంపెనీ ప్రారంభం నుంచీ పనిచేస్తున్నారు. వేరొక చోట పనిచేయడానికి మరో పని వీరికి అలవాటులేదు. దీంతో కాంట్రాక్టర్లు చెల్లించిన వేతనం తక్కువైనా సర్దుకొని వెళ్లిపోతున్నారు.

కంపెనీ నష్టాల్లోలేదని, పాలుపొంగినట్లు కంపెనీకి లాభాలొస్తున్నాయని కార్మికులు అంటున్నారు. పదేళ్ల నుంచి హౌస్ కీపింగ్ పనిచేస్తున్న తనకు పది వేలుకు మించి ఇవ్వడం లేదని ఎస్ఇజెడ్ కాలనీకి చెందిన కూండ్రపు కుమారి వాపోయింది. గతంలో పదో తేదీలోపు ఇచ్చే జీతాన్ని ఇప్పుడు 22-25 మధ్య చెల్లిస్తున్నారని తెలిపింది. జీతాలు సకాలంలో ఇవ్వకపోయినా సర్దుకొని వెళ్తిపోతున్న తమను ఇలా రోడ్డున పడేయడం ఎంతవరకు సబబని ప్రశ్నిస్తోంది. బికాం కంప్యూటర్ పూర్తి చేసిన ఎల్.ప్రసాద్ 2012 నుంచి ఇఒటి ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. స్కిల్డ్ వర్క్ కలిగిన అతనికి రోజుకు రూ.614ను మాత్రమే కాంట్రాక్టర్ చెల్లిస్తున్నాడు.

గతంలోనూ కంపెనీ మూత

కార్మికులను పర్మినెంట్ చేయబడుతుందని 2015 డిసెంబరు నుంచి 2016 జూన్ వరకు అభిజిత్ కంపెనీని యాజమాన్యం మూసేసింది. కంపెనీ తెరిచాక పాతవారిని కొత్తగా పనిలోకి తీసుకుంటున్నట్లు కాంట్రాక్టర్ల ద్వారా పనిలోకి తీసుకుంది. మళ్లీ నష్టాల పేరుతో సోమవారం కంపెనీ మూసేసి కార్మికుల ఉపాధిని దెబ్బతీసింది. యాజమాన్యం కంపెనీని మూసివేయడంతో కార్మిక కుటుంబాల్లో ఆందోళన మొదలైంది. తామిప్పుడు ఎక్కడకు పనిలోకి వెళ్లగలమని వారంతా వాపోతున్నారు. చట్ట విరుద్ధంగా కంపెనీని మూసేసిన యాజమాన్యంపై ప్రభుత్వం చర్యలు తీసుకొని, కంపెనీని తెరిపించి కార్మికులకు పని కల్పించాలని మంగళవారం సిఐటియు నేతృత్వంలో కార్మికులు ఆందోళన చేపట్టారు.

యుపిహెచ్‌సిలో రోగులకు అందుతున్న వైద్య సదుపాయాలపై ఆరా తీస్తున్న కలెక్టర్

శభాష్..!

మంగళవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి పరిస్థితులను గమనించారు. ఓపీ సంఖ్య, అందుబాటులో ఉన్న మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలందించాలని, సకాలంలో సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆసుపత్రిలో పని చేస్తున్న ఉద్యోగుల హాజరు పుస్తకాలను, ఇతర రికార్డులను తనిఖీ చేశారు. ఆయన వెంట వైద్యాధికారులు, వైద్యులు ఉన్నారు.

అదే ప్రాంతంలో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని కూడా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిన్నారుల హాజరు శాతాన్ని, సరుకుల నిల్వలను పరిశీలించారు. ఈ క్రమంలో కాసేపు చిన్నారులతో ముచ్చటించారు. వారితో సరదాగా గడిపారు. తనిఖీలో భాగంగా నిర్వాహకులతో మాట్లాడిన ఆయన పలు అంశాలపై సూచనలు చేశారు. నెలవారీ సరుకులు, టిహెచ్ఆర్, కేంద్రానికి వస్తున్న చిన్నారులకు అందిస్తున్న ఆహారం తదితర అంశాలపై నిర్వాహకులను ఆరా తీశారు. లోపాలు తలెత్తకుండా సరుకులను అందజేయాలని, చిన్నారులకు, గర్భిణులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని అక్కడివారిని ఆదేశించారు.

ఐసిజి డైరెక్టర్ జనరల్‌గా పరమేష్ శివమణి బాధ్యతల స్వీకరణ

ఉన్నారు. సముద్ర కమాండ్లలో ఐసిజికి చెందిన అన్ని ప్రధాన నౌకల్లో పనిచేశారు. న్యూఢిల్లీలోని నేషనల్ డిఫెన్స్ కాలేజీలోనూ, వెల్లింగ్టన్‌లోని డిఫెన్స్ సర్వీసెస్ స్టాఫ్ కాలేజీలో ఆయన విద్యను అభ్యసించారు. ఆయన తన ఉద్యోగ కాలంలో అందించిన సేవలకుగాను 2014లో తత్రక్షక్ పతకం, 2019లో రాష్ట్రపతి తత్రక్షక్ పతకం అందుకున్నారు.

కామర్స్ మేనేజ్‌మెంట్‌లో రత్నకుమారికి డాక్టరేట్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్ర విశ్వవిద్యాలయం కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగ పరిశోధకురాలు మాటూరి రత్నకుమారికి ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టరేట్ లభించింది. విభాగ ఆచార్యులు, ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ పర్యవేక్షణలో ఎ - హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ ప్రాక్టీసెస్ ఇన్ పబ్లిక్ సెక్టార్ - ఎ స్టడీ ఆన్ సెలెక్ట్ పబ్లిక్ సెక్టార్ ఆర్గనైజేషన్స్ ఇన్ విశాఖపట్నం అనే అంశంపై జరిపిన పరిశోధనకుగాను ఆమెకు డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా డాక్టరేట్ ఉత్తర్వులను ఎయు రిజిస్టార్ ఆచార్య ఇఎన్.ధనుంజయ రావు చేతుల మీదుగా స్వీకరించారు. మాటూరి రత్నకుమారి ప్రస్తుతం ఎన్ఎస్‌టిఎల్‌లో ప్రిన్సిపల్ ప్రైవేట్ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్నారు. ఆమెను గైడ్ ఆచార్య డాక్టర్ వి.కృష్ణమోహన్, కామర్స్ డిపార్టుమెంట్ హెచ్ఒడి డాక్టర్ జాలాది రవి తదితరులు అభినందించారు.

18న కార్మిక వ్యతిరేక విధానాలపై రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై ఈ నెల 18న విజయవాడలో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్టు ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు కె.మల్లయ్య తెలిపారు. మంగళవారం జ్ఞానాపురం జెఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీ అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ సదస్సును విజయవంతం చేయాలని కార్మిక వర్గాన్ని కోరారు. కేంద్ర సంకీర్ణ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం కూడా అదే బాటలో దూకుడుగా కార్మికులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను పట్టించుకోవడం లేదన్నారు. కార్మికుల శ్రమ శక్తిని పూర్తిగా కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ స్థానంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ తీసుకొచ్చి కార్మికులను మరింత దోపిడీకి గురిచేసి అభద్రతలోకి నెట్టే పరిస్థితిని తీసుకొచ్చిందన్నారు. రాష్ట్రంలో అతిపెద్ద పారిశ్రామిక కేంద్రంగా ఉన్న విశాఖలో రెగ్యులర్ జెసిఎల్‌ను కార్మిక శాఖలో నియమించకపోవడం దారుణమన్నారు. యాజమాన్యాలు దీనిని అవకాశంగా తీసుకొని కార్మిక వర్గంపై అనేక రూపాల్లో దాడులు చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఆఫీసు బేరర్లు ఎం.తిరుపతిరావు, బి.భూషణం, కె.జయమ్మ, మురికివాడ నివాసుల సంక్షేమ సంఘం నగర కన్వీనర్ ఈసర లక్ష్మి పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE (INSOLVENCY COURT) AT SRIKAKULAM
IP. No 5/2023

Between:
Soppa Ranjit Kumar ...Petitioner
And:
1. **Guntuku Sankara Rao**
2. **Gujju Surya Chandra**
3. **Kolla Sankara Rao**
4. **Kasi Ravi Kumar**
5. **Chikalapalli Laxmi Narsinga Rao**
6. **Gonigunta Vijaya Nirmala**
7. **Branch Head, I.C.I.C.I Bank, Dwarakanagar, Visakhapatnam.** ...Respondents

To,
R.3:- Kalla Sankara Rao, S/o Suryanarayana, Hindu, aged about 43 years, 2nd building, 2nd Floor, Backside of Electrical Transformer, Opp. Line of Saloon Shop, 5th line, Balaji Nagar, Arilova, Visakhapatnam-530040. Mobile No.8639009604, 9290859735

NOTICE

Please Take notice that the above matter stands posted on 01-11-2024 for your appearance before the court, therefore you are hereby directed to appear before the Honorable court on **01-11-2024 at 10.30 A.M.** either in person or through an Advocate, failing which the matter will be decided in your absence.

(By Order of the Hon'ble Court)
P.V. RAMANA DAYAL
ADVOCATE,
SRIKAKULAM, CELL: 9849171366

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE ANAKAPALLI
O.S.18/2017

Between:
Vedula Vasudeva Rao
S/o. Late China Suryanarayana ... Plaintiff
And:
Vedula China Venkata Chainulu
S/o. Late Ardhanareeswarudu
(Died and represented by his Lrs)
Smt. Vedula Bharathi W/o. Late China Venkata Chainulu and two others ... Defendants

NOTICE OF SUMMONS TO THE DEFENDANTS

To
1. Vedula Venkata Kasi Visweswarudu S/o. Late China Venkata Chainulu,
2. Vedula Srinivas S/o. Late China Venkata Chainulu, C/o Smt. Vedula Bharathi,
Both Residents of D.No. 12-10-3, Vedula Vari Veedhi, Anakapalle Town & Dist.

The above named plaintiff filed the above suit for a declaration that the plaintiff is the absolute owner of the plaint schedule property of about 06.25 cents of Kallam Dibbalu in Survey No.137/5 of Nagulapalli Village in Munagapaka Mandal of Anakapalle District and to grant a consequential permanent injunction restraining the defendants, their men and agents from ever interfering with his peaceful possession and enjoyment of the plaint Schedule land including its alienation in any manner etc.

Consequent on the death of the sole defendant the Hon'ble Court ordered to issue notice to the proposed defendants for including them as the defendants in the matter and accordingly the plaintiff issued the notice to both two of you on a number of occasions. But you have not appeared in the matter so far. Hence the Hon'ble Court ordered to issue notice of Summons to you by way of paper publication in the local News Paper. So please take notice that you are hereby summoned to appear in this Court on the next date of posting i.e..on **22-10-2024 at 10-30 A.M.** If you fail to appear in the above said Hon'ble Court on that date, you will be set exparte and the matter will be heard in your absence and necessary orders will be passed in this matter.

(By the Order of the Hon'ble Court)
Sk. Sulaiman & Sk. Meeravali Shareef,
Advocates,
Visakhapatnam at Anakapalle
Cell: 9848189301, 9298602659.

IN THE COURT OF THE HON'BLE I ADDL. JUNIOR CIVIL JUDGE-CUM-VII ADDL. JUDICIAL MAGISTRATE OF FIRST CLASS, RANGA REDDY DISTRICT, AT: HAYATH NAGAR
I.A. No. 3281 of 2021
IN
O.S. No. 740 of 2021

Between:
Keesari Madhavi, ...Petitioner/Plaintiff
And
Chanduri Padmavathi, & another ...Respondents/Defendants

To,
Chanduri Padmavathi, W/o C. Ramakrishna, R/o.: Railway Quarter No.660/D, Sevanagar, Opposite to Railway Stadium, Vishakapatanam, A.P. **(R1)**

Please take notice that the above named Petitioner/Plaintiff has filed the above I.A for grant of Ad interim injunction with I.A. No. 3281 of 2021 IN OS No. 740 of 2021 on the file of Hon'ble I Addl. Junior Civil Judge, Ranga Reddy District, At: Hayath Nagar against you. As per the orders of the Hon'ble Court, issuing this notice by informing the date of hearing and the matter is posted on 04-11-2024 for your appearance before the above said Hon'ble Court. Therefore, you are hereby informing to make it convenient yourself to attend the above said Hon'ble Court on 04-11-2024 at 10-30 a.m. by person or through advocate, failing which the matter will be decided on merits.

(BY ORDER OF THE HON'BLE COURT)
M/s. GOLI VIPLAV REDDY
R. SANTHOSH KUMAR REDDY
ADVOCATE,
Plot No: 247, Phase-II, F.C.I. Colony, Vanasthalipuram, Hyderabad 70, 9848283777.
Counsel for the Plaintiff

IN THE COURT OF THE HON'BLE I ADDL. JUNIOR CIVIL JUDGE-CUM-VII ADDL. JUDICIAL MAGISTRATE OF FIRST CLASS, RANGA REDDY DISTRICT, AT: HAYATH NAGAR
O.S. No. 740 of 2021

Between:
Keesari Madhavi, ...Plaintiff
And
Chanduri Padmavathi, & another ...Defendants

To,
Chanduri Padmavathi, W/o C. Ramakrishna, R/o.: Railway Quarter No.660/D, Sevanagar, Opposite to Railway Stadium, Vishakapatanam, A.P. **(D1)**

Please take notice that the above named Plaintiff has filed the above suit for perpetual injunction with OS No. 740 of 2021 on the file of Hon'ble I Addl. Junior Civil Judge, Ranga Reddy District, At: Hayath Nagar against you. As per the orders of the Hon'ble Court, issuing this notice by informing the date of hearing and the matter is posted on 04-11-2024 for your appearance before the above said Hon'ble Court. Therefore, you are hereby informing to make it convenient yourself to attend the above said Hon'ble Court on 04-11-2024 at 10-30 a.m. by person or through advocate, failing which the matter will be decided on merits.

(BY ORDER OF THE HON'BLE COURT)
M/s. GOLI VIPLAV REDDY
R. SANTHOSH KUMAR REDDY
ADVOCATE,
Plot No: 247, Phase-II, F.C.I. Colony, Vanasthalipuram, Hyderabad-70, 9848283777.
Counsel for the Plaintiff

అధ్వానంగా జగనన్న కాలనీ రోడ్లు

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని జగనన్న కాలనీ రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ముందుగా రోడ్లు ఏర్పాటుచేసి అనంతరం ఇళ్ల నిర్మాణాలు చేపడితే లబ్ధిదారులు వ్యక్తిగతంగా కట్టుకోడానికి అవకాశాలుంటాయి. అధికారులు హడావిడితో కాలనీలో మౌలిక వసతులు కల్పించకుండా ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేయడంతో కొంత మంది మాత్రమే నిర్మాణాలు చేపట్టారు. సరైన రహదారులు, మౌలిక వసతులు లేకపోవడంతో నిర్మాణాలు మధ్యలోనే ఆగిపోయాయి. ఆనందపురం పంచాయతీ పరిధిలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వెనుక ఉన్న కాలనీలో సుమారు 150 మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారు. మౌలిక వసతులు, రోడ్లు ఏర్పాటుచేయకపోవడంతో కొంతమంది మాత్రమే నిర్మాణాలు చేపట్టారు. నీరు, మెటీరియల్ రక్షణ సదుపాయం లేకపోవడంతో మధ్యలోనే కొందరు పనులు ఆపివేశారు.

ఇటీవల కురుస్తున్న వర్షాలకు మట్టితో వేసిన రోడ్లన్నీ బురదమయమయ్యాయి. కాలనీలో అడుగుపెట్టడానికి కూడా ఇబ్బందికరంగా మారింది. గ్రామాలకు శివారులో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీల్లో నిర్మాణ మెటీరియల్‌కు రాత్రి వేళల్లో రక్షణ లేకుండా పోతుందని, దొంగతనాలు జరుగుతున్నాయని లబ్ధిదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా కాలనీలో రోడ్లు ఏర్పాటుచేసి, నీటి వసతిని కల్పించి, నిర్మాణాల మెటీరియల్‌కు రక్షణ కల్పించేలా చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

బురదమయంగా ఉన్న జగనన్న కాలనీ రోడ్డు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వాచ్‌మ్యాన్ దుర్మరణం

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక గోస్తనీకి ఆనుకుని ఉన్న రహదారి కూడలి మలుపు వద్ద రోడ్డు దాటే క్రమంలో అతి వేగంగా వస్తున్న కారు సోమవారం రాత్రి సుమారు 9.30 గంటల సమయంలో ఢీ కొన్న ప్రమాదంలో ప్రయివేట్ సంస్థలో పని చేస్తున్న వాచ్‌మ్యాన్ దుర్మరణం చెందాడు. భీమిలి పోలీసుల కథనం ప్రకారం.. విజయనగరం జిల్లా, గంట్యాడ మండలం, కొటానుబిల్లి గ్రామానికి చెందిన దాకమర్రి శ్రీను (40), అతని తండ్రి సూరి, శ్రీను పిల్లలు 15 ఏళ్ల దీపక్, 12 ఏళ్ల సందీప్ కలిసి విజయవాడ, కనక దుర్గమ్మ దర్శనానికి ఈ నెల 13న వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఈ నెల 14న భీమిలి వచ్చేందుకు తగరపువలస గోస్తనీ జంక్షన్ రహదారి కూడలి వద్ద బస్సు దిగారు. కూడలి మలుపు వద్ద రోడ్డు దాటే క్రమంలో విశాఖ నుంచి విజయనగరం వెళ్తున్న కారు శ్రీనును బలంగా ఢీకొంది. తీవ్ర గాయాలతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని తండ్రి సూరి ఫిర్యాదు మేరకు ఎస్ఐ జి.హరీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుని కుటుంబం బతుకు తెరువు కోసం కొంత కాలం క్రితం భీమిలి వచ్చారు. భీమిలి అప్పికొండ వీధిలో ఓ ప్రయివేటు సంస్థ వద్ద మృతుడు శ్రీను వాచ్‌మ్యాన్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకునే వాడు. కళ్లెదుటే తండ్రి శ్రీను మృతిచెందడంతో కుమారులు, శ్రీను తండ్రి దుఃఖానికి అవధులు లేవు. భార్య రవణమ్మ కన్నీటి పర్యంతమైంది.

తండ్రిని హత్యచేసిన కొడుకు

ప్రజాశక్తి-పెందుర్తి : కన్నతండ్రి మందలించాడనే కోపంతో అతన్ని కుమారుడు హతమార్చిన ఘటన నరవ గ్రామంలో చోటుచేసుకుంది. నరవ గ్రామానికి చెందిన గోపి చెడు తిరుగుళ్లు తిరుగుతున్నాడని తండ్రి దేముడు (60) తరచూ మందలించేవాడు. ఈ విషయాన్ని మనుసులో పెట్టుకొని మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో పడుకొని ఉన్న తండ్రి మెడపై కత్తితో నరికి చంపాడు. పెందుర్తి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి కేసు నమోదు చేశారు.

స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికుడు అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ సింటర్ ప్లాంట్ సమీపంలో కాంట్రాక్టు కార్మికుడు అనుమానాస్పదంగా మృతి చెంది ఉన్నాడు. సోమవారం బి షిఫ్ట్‌కు వెళ్లిన అశోక్‌రెడ్డి ఇంటికి రాకపోవడంతో పోలీసులకు కుటుంబీకులు ఫిర్యాదుచేశారు. అయితే మృతదేహం కాలువలో పడి ఉండడాన్ని మంగళవారం తెల్లవారుజామున కార్మికులు గుర్తించారు. మృతుడు పెదగంట్యాడకు చెందిన అశోక్‌రెడ్డిగా గుర్తించారు. బైకు ప్రమాదానికి గురైనట్లు కనిపిస్తున్నా మృతుడు పడి ఉన్న చోటుకు వాహనం 100 మీటర్ల దూరంలో ఉండటంతో కార్మికులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. ఉక్కునగరం పోలీస్ స్టేషన్ సిఐ కేశవరావు ఆధ్వర్యాన కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు.

కెజిబివిలో పలు ఉద్యోగాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు చేసుకోవాలని ఎంఇఒ పి.రమణ సూచించారు. డే అండ్ నైట్ వాచ్‌మ్యాన్, హెడ్ క్లర్క్, గ్రూప్ అసిస్టెంట్ క్లర్క్, చౌకీదారుల పోస్టులు భర్తీచేయనున్నట్లు తెలిపారు. పద్మనాభం ఎంఇఒ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ ఓటు నమోదుపై ప్రచారం

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలంలోని పలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు నమోదుపై మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఎపిటిఎఫ్ ఆనందపురం మండల అధ్యక్షులు జి.గంగాధరుడు మాట్లాడుతూ, ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు బోధించే ఉపాధ్యాయులందరూ ఎమ్మెల్సీ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. నవంబర్ 30వ తేదీలోపు అర్హత ఉన్న ఉపాధ్యాయులు ఓటర్‌గా నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సర్వీస్ సర్టిఫికెట్లు హైస్కూళ్లకు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఓటును ఆన్‌లైన్ ద్వారా గాని తహశీల్దార్ కార్యాలయం వద్ద గాని రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కరుణాకరరావు, జనరల్ సెక్రెటరీ టి.రామకృష్ణ, పి.రమేష్, బి.ఈశ్వరరావు, జె.బాబూరావు, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చేతుల శుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం ఆర్.తాళ్లవలస జెడ్‌పి హైస్కూల్‌లో మంగళవారం చేతుల శుభ్రతపై అవగాహన కల్పించారు. వాష్ రూమ్‌కు వెళ్లిన తర్వాత, ఆటలు ఆడిన తర్వాత, తినడానికి ముందు, ఇంట్లో పెంపుడు జంతువులను తాకిన తర్వాత, వాటిని ఎత్తుకునే ముందు చేతులు శుభ్రపరచుకోవాలని విద్యార్థుల్లో అభ్యసన కల్పించారు. రోజూ ఇలా 7 పద్ధతుల్లో చేతులు శుభ్ర పర్చుకోవాలని, లేకుంటే బ్యాక్టీరియా కడుపులోకి వెళ్లి అనేక రోగాల బారిన పడతామని స్పష్టం చేశారు. మ్యాజిక్ బస్ సంస్థ ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ప్రభాకరరావు, సంస్థ ప్రతినిధులు కె.రవణమ్మ, ఎం.సాయికుమారి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భీమిలి డివిజన్‌లో 16 నీటి సంఘాలకు ఎన్నికలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : భీమిలి డివిజన్ పరిధిలో గల భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో ఉన్న 16 నీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు జరుగనున్నాయి. ఇందు నిమిత్తం ఈ నెల 16న నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు తెలిసింది. అదే రోజు నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు. భీమిలి మండలంలో 5 నీటి సంఘాలున్నాయి. ఇందులో 127 ఎకరాల ఆయకట్టున్న కాపులుప్పాడ ఓపెన్ హెడ్ ఛానెల్, 260 ఎకరాలు ఆయకట్టున్న దాకమర్రి ఇల్లందేవి చెరువు, 30 ఎకరాలు ఆయకట్టున్న ఆర్.తాళ్లవలస పెద్ద చెరువు, 1137 ఎకరాలు ఆయకట్టున్న తాటితూరు, సింగనబంద ఆయకట్టుకు సాగు నీరు అందించే కురపల్లి ఛానెల్ సిస్టం,1400 ఎకరాలకు నీరు అందించే దివాంజీ చెరువు ఉన్నాయి.

ఆనందపురం మండలంలో 4 నీటి సంఘాలు ఉన్నాయి. ఇందులో 115 ఎకరాలున్న కుశలవాడ పల్లిచెరువు, 150 ఎకరాలున్న శొంఠ్యాం పెద్ద చెరువు, గొట్టిపల్లి నుంచి పెద్దిపాలెం వరకు 150 ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందించే గుడిలోవ ఛానెల్ సిస్టం, 200 ఎకరాలు ఆయకట్టున్న గంభీరం రిజర్వాయర్ ఉన్నాయి .

పద్మనాభం మండలం లో 7 నీటి సంఘాలు ఉన్నాయి. ఇందులో 190 ఎకరాలున్న కోరాడ కృష్ణంరాజు చెరువు, 120 ఎకరాలున్న మద్ది వెంకటపతిరాజు చెరువు, 550 ఎకరాలు ఆయకట్టున్న పొట్నూరు నూకాంబికా చెరువు, 375 ఎకరాలు ఆయకట్టున్న పాండ్రంగి కాటమయ్య చెరువు, 120 ఎకరాలు, 107 ఎకరాలు ఆయకట్టున్న గంధవరం నరసింహారాజు చెరువు, కర్రివాని చెరువు, పెంట, 130 ఎకరాలు ఆయకట్టున్న గుండమ్మ చెరువు ఉన్నాయి.

పిహెచ్‌సిలో కేంద్ర బృందం తనిఖీ

వైద్య సేవలపై ఆరా తీస్తున్న కేంద్ర బృందం సభ్యులు

ప్రజాశక్తి -ఆనందపురం : అసంక్రమిత వ్యాధులపై రోగులకు వైద్య సేవలు ఎలా అందుతున్నయో తెలుసుకునేందుకు ఢిల్లీ నుంచి వచ్చిన కేంద్ర వైద్య బృందం మంగళవారం ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసింది. రక్తపోటు, మధుమేహం, కేన్సర్ లాంటి వ్యాధులు ఎలా గుర్తిస్తున్నారు.. రోగులకు ఎలాంటి వైద్య సదుపాయాలు అందుతున్నాయని డాక్టర్ జైత్రి నేతృత్వంలోని కేంద్రబృందం ఆరా తీసింది. లోడగలవానిపాలెం, వేములవలసకు చెందిన రోగులతో మాట్లాడి సంతృప్తి వ్యక్తం చేశారు. రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్‌సిడి ప్రోగ్రాం అధికారి డాక్టర్ సమత, జిల్లా హెచ్‌డబ్ల్యుసి నోడల్ అధికారి డాక్టర్ బాలాజీ, పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ ఎం గంగునాయుడు, డాక్టర్ షహనాజ్ సాదియా తదితరులు పాల్గొన్నారు

యువతలో నైపుణ్యాలు వెలికితీతకు ప్రత్యేక శ్రద్ధ

కేంద్ర మంత్రి జయంత్‌చౌదరి

ప్రజాశక్తి -మధురవాడ : భారతీయ యువతలో నైపుణ్యాలను వెలికితీయడానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని కేంద్ర ప్రభుత్వ స్కిల్ డెవలప్‌మెంట్, ఎంటర్‌ప్రెన్యూర్ షిప్ శాఖ మంత్రి జయంత్‌చౌదరి తెలిపారు. వైద్య విద్యార్థులకు నైపుణ్యాలను పెంచడానికి గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్‌సర్) వైద్య కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని, మూర్తి ప్రయోగశాలలను, మేకర్స్ స్పేస్, వెంచర్ డవలప్‌మెంట్ సెంటర్లను ఆయన మంగళవారం సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ, పరిశ్రమల అవసరాలకు, యువతలో నైపుణ్యాలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని పూరించడానికి ఎప్పటికప్పుడు గ్యాప్ స్టడీ నిర్వహిస్తున్నామని తెలిపారు. సామాజిక శాస్త్రాలు అభ్యసించే యువతకు సైతం ఉపాధిఅవకాశాలు పెంచడానికి ప్రత్యేక ఇంటర్న్‌షిప్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. జాతీయ స్థాయిలో నైపుణ్యాలను ప్రోత్సహించడానికి స్కిల్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్ మాట్లాడుతూ, బోధనతో పాటు పరిశోధనలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. యువ పరిశోధకులను ప్రోత్సహించడానికి మూర్తి రీసెర్చ్ గ్రాంట్ రూపంలో పరిశోధన నిధులను కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికి సిలబస్‌లో తగు మార్పులు చేశామని, పరిశ్రమలతో అనుబంధాన్ని కొనసాగిస్తున్నామని చెప్పారు. విద్యార్థుల్లో స్టార్టప్ సంస్కృతిని పెంచడానికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. కార్యక్రమంలో గీతం ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ ఎమ్.గంగాధరరావు, గీతం విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, జిమ్‌సర్ ప్రొవైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి, జిమ్‌సర్ డీన్ డాక్టర్ ఎస్‌పి.రావు, స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కెఎస్.కృష్ణ, గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు, స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ డీన్ విభూతి సత్యదేవ్, పలువురు డైరెక్టర్లు ప్రిన్సిపల్స్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి జయంత్‌చౌదరిని సన్మానించి జ్ఞాపికను అందిస్తున్న ఎంపీ శ్రీభరత్

దీక్షలో కూర్చున్న జగన్ తదితరులు

పోర్టు హాస్పిటల్‌ను కాపాడుకుంటాం

ప్రజాశక్తి-సీతమ్మధార : పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణ కాకుండా కాపాడుకుంటామని సిఐటియు ఆల్ ఇండియా ఫెడరేషన్ కార్యదర్శి బి.జగన్ స్పష్టంచేశారు. పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ ఆసుపత్రి వద్ద చేపట్టిన రిలే దీక్షలు మంగళవారం నాటికి 15వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలను జగన్ ప్రారంభించి మాట్లాడారు. పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణ ఆపాలని, పోర్టు సొంత నిధులతోనే అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఈ హాస్పిటల్ ఏర్పాటులో కార్మికుల రక్తపుబొట్టు ఉన్నాయన్నారు. ప్రస్తుతం హాస్పిటల్ నడపడానికి 100 సంవత్సరాలకు సరిపడా రిజర్వ్ ఫండ్స్ పోర్టు దగ్గర ఉన్నాయన్నారు. అయినా ప్రయివేటుకు ఇవ్వాలన్న బిజెపి విధానం దుర్మార్గమైనదని పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ కాకుండా గత నాలుగేళ్ళుగా కార్మికులు పోరాడుతున్నారని, గతంలో డిసిఐ ప్రయివేటీకరణ కాకుండా కాపాడుకున్నారని, అదే స్ఫూర్తితో పోర్టు హాస్పిటల్‌ను కాపాడుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.సత్యనారాయణ, జె.సత్యనారాయణ, బి.లక్ష్మణరావు, కెఎస్.కుమార్, శంకరరావు, నాయుడు, శ్రీను, గణేష్, రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

ఎయు రిజిస్ట్రర్ ధనుంజయరావుకు చెక్కును అందజేస్తున్న గాజువాక చైతన్య మహిళా డిగ్రీ కళాశాల డైరెక్టర్

ముఖ్యమంత్రి సహాయ నిధికి చైతన్య మహిళా డిగ్రీ కళాశాల విరాళం

ప్రజాశక్తి -గాజువాక : వరద బాధితుల కోసం ముఖ్యమంత్రి సహాయనిధి నిమిత్తం గాజువాక చైతన్య మహిళా డిగ్రీ, పీజీ కళాశాల రూ.1.11 లక్షలను అందజేసింది. ఈ మొత్తాన్ని ఆంధ్ర యూనివర్సిటీ రిజిస్ట్రర్ ధనుంజయరావుకు మంగళవారం కళాశాల డైరెక్టర్ విజయలక్ష్మి, ప్రిన్సిపల్ చంద్రమహాలక్ష్మి, కామేశ్వరి అందించారు. గతంలో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ద్వారా రూ.లక్ష సహాయం అందజేశారు.

యానాద్రి చెరువు వద్ద పరిశీలిస్తున్న అధికారులు

యానాద్రి చెరువులో వ్యర్థాలపై పరిశీలన

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని రేవిడి పంచాయతీ పరిధిలో ఉన్న యానాద్రి చెరువులో వ్యర్థాలు వేస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదులపై అధికారులు మంగళవారం పరిశీలించారు. గ్రామంలో మాంసం దుకాణాలు, ఇతర షాపుల నుంచి వచ్చిన వ్యర్థాలతోపాటు పాడుబడిన ఇళ్ల వ్యర్థాలు, మట్టి తదితరాలు చెరువు గర్భానికి అనుకొని వేయడాన్ని పంచాయతీ విస్తరణ అధికారి మీనా కుమారి, గ్రామ కార్యదర్శి నూర్జహాన్, ఎంపిటిసి ఎస్.సూరప్పడు పరిశీలించారు.

నాణ్యతతో పనులు చేపట్టాలి

ప్రజాశక్తి -ఉక్కునగరం : పనుల నాణ్యతలో రాజీ పడవద్దని జివిఎంసి 87వ వార్డు కార్పొరేటర్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్నాధం (జగన్) సూచించారు. వార్డు పరిధిలో చేపట్టిన ప్రధాన కాలువ అభివృద్ధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సంబంధిత కాంట్రాక్టర్, అధికారులతో మాట్లాడుతూ, పనులను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఇ అప్పారావు, ఎఇ మహాలక్ష్మి, నాయకులు రాజేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి నోచని తర్లువాడ

ప్రజాశక్తి- ఆనందపురం : మండలంలోని తర్లువాడ పంచాయతీ అభివృద్ధికి నోచలేదు. రోడ్లు, మౌలిక వసతులు లేక గ్రామస్తులు పలు ఇబ్బందులు పడుతున్నారు. హైవే నుండి తర్లవాడ గ్రామంలోకి వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉండడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రామంలో హోమియోపతి వైద్య సేవలు లభించడంతో శని, ఆదివారాలలో ఉత్తరాంధ్ర జిల్లాల్లోని పలు ప్రాంతాల నుంచి సుమారు వెయ్యి మంది రోగులు తెల్లవారుజామునే గ్రామానికి చేరుకుంటుంటారు. రోడ్డు అధ్వానంగా ఉండటం, వీధిలైట్లు లేకపోవడంతో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హైవే టోల్‌గేట్ సమీపంలో తర్లవాడ గ్రామపంచాయతీ బోర్డు ఏర్పాటు చేయాలని, వైద్యానికి వెళ్లే రహదారి కొండ ప్రాంతం కావడంతో వీధిలైట్లు ఏర్పాటుచేయాలని పలువురు కోరుతున్నారు.

ఈ పంచాయతీలో ఎంపిపి, సీనియర్ నాయకులు ఉన్నా అభివృద్ధిలో వెనుకబడి ఉందని గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో గ్రామంలో మౌలిక వసతులు కానరాలేదు. కనీసం కూటమి ప్రభుత్వంలోనైనా మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టి తర్లువాడ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని గ్రామ స్వచ్ఛంద సేవకులు, ప్రముఖ వ్యాపారవేత్త కోరాడ ఆదినారాయణ, గ్రామ ప్రజలు కోరుతున్నారు.

అధ్వానంగా ఉన్న తర్లువాడ రోడ్డు

ధరలపై సిపిఐ నిరసనలు

ప్రజాశక్తి-యంత్రాంగం

నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యాన పలుచోట్ల మంగళవారం నిరసనలు తెలిపారు.

గాజువాక : సిపిఐ గాజువాక నియోజకవర్గం సమితి ఆధ్వర్యాన కొత్త గాజువాక మార్కెట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ, రాష్ట్రంలో నిత్యవసర సరుకుల ధరలను కట్టడి చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో పల్లేటి పోలయ్య, కెంగువ అచ్యుతరావు, ఎ.విష్ణు, పి.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

మధురవాడలో నిరసన తెలుపుతున్న సిపిఐ నాయకులు

పెందుర్తి: పెందుర్తి రైతు బజార్ వద్ద సిపిఐ నాయకులు నిరసన తెలిపారు. పెరుగుతున్న నిత్యవసరాల ధరలను అదుపుచేయాలని నినదించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు అత్తిలి విమల, ఆర్.శ్రీను, వై.రాంబాబు, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

మధురవాడ : జివిఎంసి 5వ వార్డు పరిధి శివశక్తినగర్‌లో సిపిఐ ఆధ్వర్యాన ధరల పెరుగుదలపై ఇంటింటికీ కరపత్రాలు పంపిణీచేశారు. ఈ సందర్భంగా సిపిఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం పైడిరాజు మాట్లాడుతూ, మోడీ మూడోసారి అధికారంలోకి వచ్చాక వ్యాపారస్తులు పండుగ చేసుకుంటున్నారన్నారు. ధరలు నియంత్రణ చేసే నాథుడే లేడన్నారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఎమ్.డి.బేగం, వి.సత్యనారాయణ, ఎస్‌కె సల్మా, బి.కేశవయ్య తదితరులు పాల్గొన్నారు.

ములగాడ : పెంచిన నిత్యవసర వస్తువులు ధరలు తగ్గించాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యాన మల్కాపురం ప్రాంతంలో కరపత్రాలు పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యఆంజనేయ, గుడాల రాంబాబు, నూనెల సూరిబాబు, బి.సత్యానందరావు తదితరులు పాల్గొన్నారు.

అదనపు తరగతి గదులు ప్రారంభం

ప్రజాశక్తి-ములగాడ : జివిఎంసి 58వ వార్డు పరిధి శ్రీహరిపురంలోని కోరమండల్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ సౌజన్యంతో నిర్మించిన జివిఎంసి స్కూల్ అదనపు తరగతి గదులను, సైన్స్ ల్యాబ్‌ను పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గణబాబు మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ అంగ దుర్గాప్రశాంతి, టిడిపి నాయకులు సీరం ఉమామహేశ్వరి, కోరాడ శ్రీనివాసరావు, పోతాబత్తుల శ్రీనివాస్, రామ్మోహన్ నాయుడు, మాత శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తరగతి గదులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

డిస్లెక్సియాపై అవగాహన

ప్రజాశక్తి -యంత్రాంగం

డిస్లెక్సియాపై పలుచోట్ల మంగళవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

భీమునిపట్నం : పిల్లల్లో పురోభివృద్ధిని పెంచాలని కోరుతూ నిర్దిష్ట అభ్యాస వైకల్యాలపై స్థానిక ఎండిఒ కార్యాలయం నుంచి మెయిన్ రోడ్డు మీదుగా పాత బస్టాండ్ వరకుఅవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ నెల 14 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ అవగాహన కార్యక్రమాల్లో భాగంగా స్థానిక భవిత కేంద్రం ఆధ్వర్యాన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎంఇఒ-1 ఎం.శివరాణి, ఎంఇఒ-2 జయప్రద మాట్లాడుతూ, అభ్యసన వైకల్యం గల పిల్లలు అక్షరాలను, పదాలను సరిగా పలక లేకపోవడం, చదవడం, అర్థం చేసుకోవడంలో లోపం కలిగి ఉంటారని తెలిపారు. అభ్యసన వైకల్యం గల పిల్లలను గుర్తించేందుకు ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండిఒ ఎన్.హనుమంతరావు, ఎఒ నగేష్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, ఐఇఆర్‌పిలు కె.జియకుమారి, పార్వతి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆనందపురం : ఆనందపురం మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో డిస్లెక్సియా అవగాహన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అంజనీ కుమారి మాట్లాడుతూ పఠన వైకల్యాన్ని ఆదిలోనే గుర్తించి విద్యార్థులకు తగిన విధంగా విద్యాబోధన చేయాలన్నారు. వీటిపై తల్లిదండ్రులు కూడా అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు ముత్యాలనాయుడు, శ్రీనివాసరావు, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

మధురవాడ : అభ్యసన వైకల్యాలు తొలగించి పిల్లల్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఎమ్ఇఒ పి.అనురాధ చెప్పారు. మధురవాడ మినీ భవిత కేంద్రంలో డిస్లెక్సియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. విభిన్న ప్రతిభావంతులైన చిన్నారులకు అభ్యసన వైకల్యాలు ఎలా అధిగమించాలి, తీసుకోవలసిన చర్యలపై సదస్సు నిర్వహించారు. వైకల్యాలు ఉన్న పిల్లలను భవిత కేంద్రాల్లో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో స్పెషల్ ఎడ్యుకేటర్ రవికృష్ణ, భవిత కేంద్రం శిక్షకులు ఎస్.మహాలక్ష్మి, ఎస్‌కె.సలీమాసిహిజ తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం : పద్మనాభంలోని భవిత సెంటర్ ఆధ్వర్యాన డిస్లెక్సియా అవేర్‌నెస్ ర్యాలీ నిర్వహించారు. ఐఇఆర్‌టి కో-ఆర్డినేటర్లు శ్రీనివాసరావు, రాజకుమార్ మాట్లాడుతూ, అక్షరాలను, పదాలను సరిగా పలకలేకపోవడం, చదవడంలోను, అర్థంచేసుకోవడంలో లోపం కలిగి ఉన్న పిల్లలను గుర్తించడం కోసం ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్డిపల్లి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎం.సన్యాసిరావు, సిడబ్ల్యుఎస్ఎన్ విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

కశింకోట : కశింకోట భవిత కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం డేస్లెక్సియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. నిర్దష్ట అభ్యసన, పిల్లలు వైకల్యంపై తల్లి దండ్రులు శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ర్యాలీలో ఐఆర్‌టి ఉపాధ్యాయులు కొరుప్రోలు వెంకటేశ్వరరావు, భవిత కేంద్రం ఉపాధ్యాయులు బివి. రమణమ్మ, నెంబర్ 2 పాఠ శాల ఉపాధ్యాయులు సిహెచ్. రాము నాయుడు, శంకర్ రావు, అంగన్వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పద్మనాభంలో భవిత సెంటర్ ఆధ్వర్యాన ర్యాలీ

నక్కపల్లి: మండలంలోని గొడిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలప్రత్యేక ఉపాధ్యాయురాలు షేక్ జాస్మిన్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసాక్ ఫర్ డిస్లెక్సియా ర్యాలీ నిర్వహించారు. గొడిచెర్ల కొత్తూరు, దొంకాడ కొత్తూరు గ్రామాల్లో ర్యాలీ,మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎంఈఓ 2 వేమగిరి నూకరాజు మాట్లాడుతూ, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు ఆత్మస్థైర్యంతో ఉన్నత విద్యను అభ్యసించి ముందుకు సాగాలన్నారు.ప్రత్యేక ఉపాధ్యాయురాలు షేక్ యాస్మిన్ మాట్లాడుతూ, అభ్యసన వైకల్యాలను గుర్తించి విద్యను బోధించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిఎం సూర్య ఘర్ పథకాన్ని వినియోగించుకోవాలి

జిల్లాలో 5 సోలార్ మోడల్ గ్రామాల ఎంపిక : జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

ప్రజాశక్తి-అనకాపల్లి : సాంప్రదాయేతర ఇంధన వనరుల ప్రోత్సాహంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పిఎం సూర్య ఘర్ సబ్సిడీ వినియోగించుకొని ప్రతి ఇంటికి సోలార్ విద్యుత్ యూనిట్ ఏర్పాటు చేసుకోవాలని జిల్లా కలెక్టరు విజయకృష్ణన్ తెలిపారు. మంగళవారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకం (మఫ్ట్ బిజిలీ యోజన)పై జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టరు విజయ కృష్ణన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సాంప్రదాయేతర ఇంధన వనరులు ప్రోత్సాహక బహుమతికి ఐదు గ్రామాలు ఎంపిక చేశామన్నారు. జిల్లాలో గుర్తించిన గ్రామాలను పూర్తిస్థాయిలో సోలార్ మోడల్ గ్రామాలుగా రూపొందించాలని తెలిపారు. ప్రజలందరూ వినియోగించుకొనేలా ఈ పథకంపై విద్యుత్ శాఖ సిబ్బంది అవగాహన కల్పించాలని తెలిపారు. సోలార్ యూనిట్ ఏర్పాటుతో ఉత్పత్తయిన విద్యుత్ మనం వాడుకోగా మిగిలిన విద్యుత్‌తో ప్రజలకు ఆదాయం వస్తుందనే విషయాన్ని ప్రచారం చేయాలని తెలిపారు. కొత్తగా నిర్మిస్తున్న గ్రామ సచివాలయ భవనాలకు ఈ పథకాన్ని ఏర్పాటుచేయాలని అధికారులను ఆదేశించారు. ఇంటిపై సోలార్ యూనిట్ పెట్టుకొనుటకు అవకాశం గల ఇళ్లను గుర్తించి వారికి అవగాహన కల్పించాలని, దరఖాస్తు చేయించాలని తెలిపారు. గృహసముదాయాలు, ఆసుపత్రులు, దుకాణ సముదాయాలలో ఏర్పాటు చేసుకొనేలా ఆ ప్రాంత అసిస్టెంటు ఇంజనీర్లు పనిచేయాలని తెలిపారు. సోలార్ యూనిట్లు ఉపకరణాలను సరఫరాచేసే సంస్థలు నాణ్యమైన, వారంటీ గల వాటిని మాత్రమే సరఫరా చేయాలని తెలిపారు. విద్యుత్ శాఖ ఎస్.ఇ. జి.ప్రసాదు పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని పెంచుటకు, కర్బన ఉద్గారాలను తగ్గించుటకు కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందని, జిల్లాలో ముప్పై వేల సోలార్ యూనిట్లు ఏర్పాటుకు లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. మూడు కిలోవాట్ల వరకు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందని, ఒక కిలోవాటుకు రూ.30వేలు, రెండు కిలో వాట్లకు రూ. 60వేలు, మూడు కిలోవాట్లకు రూ.78 వేలను సబ్సిడీగా ప్రభుత్వం యూనిట్ స్థాపించిన పిదప 45రోజులలో తిరిగి వినియోగదారుని బ్యాంకు ఖాతాకు అందిస్తుందని తెలిపారు. యూనిట్ మొత్తానికి బ్యాంకు రుణం పొందే అవకాశం కూడా ఉందన్నారు. పెట్టుబడి మొత్తం మూడు లేక నాలుగు సంవత్సరాలలో తిరిగి వచ్చేస్తుందని తెలిపారు. జిల్లాలో 1677 మంది దరఖాస్తుచేసుకోగా వారిలో 288 మంది మాత్రమే రూ.1300 ఫీజు చెల్లించారని, మిగిలిన వారితో ప్రాసెసింగు ఫీజు చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో జిల్లా పరిషత్ సిఇఒ పి. నారాయణమూర్తి, నెడ్ క్యాప్ డెవలప్మెంటు అధికారి సిహెచ్.పవన్, విద్యుత్ శాఖ ఇఇలు, డిఇలు, ఎఇలు, సోలారు కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేటి నుంచి రెవెన్యూ గ్రామ సభలు

ప్రజాశక్తి-అనకాపల్లి : భూముల రీసర్వే పూర్తయిన గ్రామాలలో బుధవారం నుండి గ్రామసభలు నిర్వహించాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరు కార్యాలయం నుండి తహశీల్దార్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కార్యక్రమ నిర్వహణపై సూచనలు చేశారు.

జిల్లాలో రీ సర్వే పూర్తయిన 455 గ్రామాలలో గ్రామసభలు నిర్వహించాలన్నారు. 30 రోజులలో గ్రామ సభలు పూర్తయ్యే విధంగా షెడ్యూలు తయారుచేసుకోవాలని సూచించారు. గ్రామసభల్లో అన్ని రకాల భూసమస్యలపై విజ్ఞప్తులు స్వీకరించాలని తెలిపారు. రీ-సర్వేతో నష్టపోయినట్లు రైతులెవరైనా ఫిర్యాదు చేస్తే క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యను పరిష్కరించాలన్నారు. రీసర్వేలో జరిగిన పొరపాట్లను సరిచేయాలన్నారు. గ్రామ సభనిర్వహణపై ముందుగా గ్రామంలో ప్రచారం చేయాలని తెలిపారు. గ్రామసభకు తహశీల్దారు, మండల సర్వేయరు, గ్రామస్థాయి సిబ్బంది తప్పని సరిగా హాజరుకావాలని ఆదేశించారు. ప్రజావేదిక, ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం(పి జి ఆర్ ఎస్)లలో వచ్చిన అర్జీల పరిష్కారంలో ప్రత్యేకశ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టరు తెలిపారు. అర్జీలకు ఏదో ఒక సమాధానం రాసి పంపకుండా, పూర్తిగా పరిశీలించి, అర్థంచేసుకొని పరిష్కరించాలని జిల్లా కలెక్టరు ఆదేశించారు. తహశీల్దార్లు ప్రతిరోజు మొదటి పనిగా తమ కార్యాలయానికి వచ్చిన అర్జీలను పరిశీలించాలని, ఫిర్యాదుదారునితో నేరుగా మాట్లాడాలని, అవసరమైతే క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లి సమస్యను పరిష్కరించాలని తెలిపారు. తహశీల్దారు పంపిన రిపోర్టు ఏ స్థాయిలోను వ్యతిరేకించలేని విధంగా వాస్తవాలతో సమాధానం తెలపాలన్నారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై వచ్చిన ఫిర్యాదులపై వెంటనే చర్యలు తీసుకోవాలని, ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చి భూమిని ఖాళీ చేయించాలని తెలిపారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి, జిల్లా పౌర సరఫరాల అధికారి టి.వి.ఎల్.ఎన్. మూర్తి, సివిల్ సప్లయి జిల్లా మేనేజరు పి. జయంతి, సర్వే శాఖ సహాయ సంచాలకులు గోపాల కృష్ణ, ఇతర అధికారులు, తహశీల్దార్లు పాల్గొన్నారు.

గ్రామసభల షెడ్యూల్

బుచ్చయ్యపేట : మండలంలోని పలు గ్రామాల్లో రెవెన్యూ గ్రామసభలను నిర్వహించనున్నట్లు తహశీల్దార్ ఎం.లక్ష్మి తెలిపారు. ఈ సభలలో భూముల రీ సర్వేలో నమోదైన వివరాల్లో అభ్యంతరాలు, లోపాలుంటే దరఖాస్తు చేసుకుని సరిచేసుకోవచ్చని సూచించారు. గ్రామ సభల షెడ్యూల్ వెల్లడించారు. 17న కరక, 18న చిన మదిన, 19న బట్లోవ, 21న చింతపాక ,పిపి అగ్రహారం, 22న ఐతంపూడి, 23న కొండపాలెం, 24న కెపి అగ్రహారం, 25న పొట్టి దరపాలెం, 26న పెద్ద మదిన, 28న పంగిడి, పెద పూడి, 29న ఆర్. శివరాంపురం, ఆర్ భీమవరం, 30న అప్పంపాలెం, వచ్చేనెల 1న తైపురం, 2న చిన అప్పన్నపాలెం, దిబ్బిడి, 4న మంగళాపురం, 5న గంటి కొర్లం, 6న చిట్టయ్యపాలెం, 7న తురకలపుడి, 8న నీలకంఠాపురం, రాజాం, 11 న పోలేపల్లి, 12న ఎమ్.భూపతి పాలెం, మల్లాం, 13 న కోమళ్లపూడి, 14న కొండెంపూడి, 15న ఎల్. సింగవరం, 16న ఎల్పిపి అగ్రహారం గ్రామాల్లో గ్రామసభలు జరుగుతాయన్నారు. రైతుల వద్ద ఉన్న రికార్డుల ప్రకారం ప్రస్తుతం ఉన్న విస్తీర్ణం సర్వే అనంతరం నమోదు చేసిన విస్తీర్ణాలను సరిచూసుకొని అభ్యంతరాలు ఉంటే తెలియజేయవచ్చు అన్నారు. ఆర్ఓఆర్ డ్రాఫ్ట్ రిజిస్టర్‌లో సవరణ చేస్తారని, ఈ అవకాశాన్ని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైవాడ, కోనాం జలాశయాల అభివృద్ధికి రూ.7.11 కోట్ల నిధులు మంజూరు

ప్రజాశక్తి- కె.కోటపాడు: మాడుగుల నియోజకవర్గంలోని రైవాడ కోనాం జలాశయాల మరమ్మతులకు రూ.7.11 కోట్ల నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి తెలిపారు. జలాశయం స్పిల్వే గేట్లు మరమ్మతులు, జలాశయంపై జంగిల్ క్లియరెన్స్, జలాశయం గట్టుపై రహదారి అభివృద్ధితోపాటు దేవరపల్లి, కే.కోటపాడు మండలాల్లో ఉన్న పంట కాలువల అభివృద్ధికి ఈ నిధులు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. రైవాడ రిజర్వాయరుకు రూ 3.06 కోట్లు కేటాయించగా కె కోటపాడు మండలంలో రిజర్వాయర్ పంట కాలువల మరమ్మతులకు రూ.39.47 లక్షలు కేటాయిస్తున్నా మన్నారు. చీడికాడ మండలంలో ఉన్న కోన జలాశయానికి రూ.99 లక్షలు మంజూరయ్యాయన్నారు. నిధులకు సంబంధించి పరిపాలన ఆమోదం లభించిందన్నారు . సాంకేతిక ఆమోదం పొందిన వెంటనే టెండర్ ప్రక్రియ చేపడతామని స్పష్టం చేశారు.

రూ.10 నాణేలపై విస్తృత ప్రచారం

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక మెయిన్ రోడ్‌లోనియూనియన్ బ్యాంక్ సిబ్బంది పది రూపాయల నాణేలపై మంగళవారం విస్తృత ప్రచారం చేశారు. దుకాణాల వద్దకు వెళ్లి రూ.పది నాణేలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పది రూపాయల నాణాలు ఎవరైనా ఇచ్చినా దుకాణదారులు తీసుకోవాలని, అందరికీ కూడా నాణేలు ఇవ్వచ్చని ప్రచారం చేశారు. బ్యాంకు డిప్యూటీ బ్రాంచ్ మేనేజర్ నానాజీ మాట్లాడుతూ పది రూపాయల నాణేలుమిగతా రాష్ట్రంలో చెల్లుబాటు అవుతున్నా, మన రాష్ట్రంలోనే ఎవరూ ఇవ్వడం గానీ, తీసుకోవడం గానీ లేదన్నారు.పది రూపాయల నాణేలు చెల్లదం లేదనే అపోహ తొలగించాలని లక్ష్యంతో యూనియన్ బ్యాంక్ అవగాహన కలిగించిందన్నారు. వ్యాపారులకు, ప్రజలకు పది రూపాయలు నాణేలు పంపిణీ చేశారు. రూ.పది నాణేలు యుబిఐ బ్యాంకుకు ఎవరు తీసుకొచ్చినా వారి అకౌంట్లో జమ చేస్తామన్నారు. కార్యక్రమంలో బ్యాంకు ఉద్యోగులు కాండ్రేగుల హరికృష్ణ, ఆడారి రాము పాల్గొన్నారు.

విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని తాళ్లపాలెం సంత వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో ఆదివారం రాత్రి మంటలు చెలరేగి స్థానికులు భయాందోళనలకు గురైన ఘటనపై సంబంధిత అధికారులు స్పందించారు. దీనిపై సోమవారం ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి ఎపిఇపిడిసిఎల్ తాళ్లపాలెం సెక్షన్ ఎఇఇ బిఎలిటి.నాయుడు మాట్లాడుతూ తాళ్లపాలెం, నర్సీపట్నం రోడ్డులో గుర్తు తెలియని వాహనం 25 అడుగులు ఎత్తులో ఉన్న విద్యుత్ వైర్లను తాకుతూ వెళ్లడం వల్ల నిప్పు రవ్వలు పడ్డాయని, వైర్లు కలిసిపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫీజు పోయిందన్నారు. తమ శాఖ సిబ్బంది వెంటనే స్పందించి, ఫీజును వేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారని తెలిపారు.

కొనసాగిన సాగర్ సిమెంట్స్ డ్రైవర్ల నిరసన

ప్రజాశక్తి-కశింకోట : వేతనాల పెంపు, ఇతర సమస్యల పరిష్కారం కోరుతూ మండలంలోని బయ్యవరం సాగర్ సిమెంట్ కంపెనీ డ్రైవర్లు మంగళవారం రెండోరోజున నిరసన కొనసాగించారు. కంపెనీలోని ట్రాన్స్‌పోర్టు, సంస్థ ప్రతినిధులకు, కార్మికుల మధ్య జరిగిన చర్చలు విఫలం కావడంతో ఆందోళన కొనసాగించారు. ట్రాన్స్‌పోర్టుప్రతినిధులు 15రోజులు గడువు ఇవ్వాలని డ్రైవర్లను కోరగా వారు అంగీకరించలేదు. ఈ సందర్భంగా గడచిన ఏడేళ్లుగా తమకు వేతనాలను పెంచలేదని, ఇప్పటికైనా డ్రైవర్ల వేతనం రోజుకు రూ.వంద పెంచాలని, ఇతర బెనిఫిట్స్ కల్పించాలని కోరారు. వాహనాల టైర్లు పేలిపోతే దాని బాధ్యతను డ్రైవర్లపై నెట్టేయడం సరికాదన్నారు. తమ సమస్యలను పరిష్కరించే వరకు ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకరరావు, జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు, సిహెచ్ శివాజీ, సాగర్ సిమెంట్ ట్రాన్స్‌పోర్టు డ్రైవర్లు సత్యనారాయణ, ఎల్ అప్పల నాయుడు, గోవిందు, రామకృష్ణ, సురేష్ పాల్గొన్నారు.

సిఐటియు ఆధ్వర్యాన నిరసన వ్యక్తం చేస్తున్న డ్రైవర్లు

అండర్ బ్రిడ్జి వద్ద నీటి సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి నాలుగు రోడ్ల జంక్షన్ నుంచి చోడవరం వైపు వెళ్లే మెయిన్ రోడ్ లో గల అండర్ బ్రిడ్జి వద్ద వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని ప్రజా సంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు డాక్టర్ చిన్ని యాదవ్,అంబేద్కర్ సేవా సమితి జిల్లా కోఆర్డినేటర్ బండి అప్పారావు, మత్స్యకారుల సంఘం నాయకులు వాసుపల్లి తాతయ్యలు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ బొబ్బిలి గోవిందరాజులు,నటభూషణ శోభన్ బాబు సేవాసమితి చైర్మన్ ముగడ అప్పారావు, ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ముంపు ప్రాంతాన్ని పరిశీలించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షం పడితే అనకాపల్లి అండర్ బ్రిడ్జి దగ్గర రోడ్డు నీటితో నిండిపోయే సమస్య దీర్ఘకాలికంగా ఉందని, అయినా ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదన్నారు.దీంతో ట్రాఫిక్ సమస్య తలెత్తితే, రైల్వే గేట్ లక్ష్మీదేవి పేట మీదగా ట్రాఫిక్ మళ్లిస్తున్నారే తప్ప సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టడం లేదన్నారు. ఇప్పటికైనా పాలకులు అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరారు.

వరి, చెరుకు సస్యరక్షణపై అవగాహన

మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని చింతలపాలెం, గొబ్బూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి ఏం. స్వప్న మాట్లాడుతూ, వరి, చెరకు పొలాలకు సోకిన చీడపీడలు, సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. చెరుకుపైర్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వివిఎ మధు, రైతులు మళ్ల గోపి, పచ్చికూర శ్రీను, మళ్ల రఘురామ్, జెర్రిపోతుల నూకినాయుడు పాల్గొన్నారు.

కె కోటపాడు : మేలైన యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా నాణ్యమైన అధిక దిగుబడులను పొందాలని జిల్లా వ్యవసాయ అధికారి మోహనరావు సూచించారు. మంగళవారం వారాడ గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతూ, ఇ- పంట సోషల్ ఆడిట్ జాబితాలు అన్ని రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని, రైతులు వారి వివరాలు చూసుకోవాలని సూచించారు. ప్రభుత్వం సబ్సిడీపై ఇస్తున్న డ్రిప్, స్ప్రింకర్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎఒ సోమశేఖర్, ఎఇఒ లైలా దేవి, పశువైద్యాధికారి డాక్టర్ ఎర్రంనాయుడు పాల్గొన్నారు.

దేవరాపల్లి: మండలంలోని ఏ కొత్తపల్లి గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారి బి మోహన్ రావు పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. ఎఒ ఎల్ కాంతమ్మ మాట్లాడుతూ, కొత్త రకం మినుములు, పెసలు, నువ్వులు, చోడి విత్తనాలు కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రానికి వచ్చి పేరు నమోదు చేయించు కోవాలని సూచించారు.

నేటి నుంచి జీవాలకు నట్టల నివారణ వ్యాక్సినేషన్

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని గొర్రెలు, మేకలకు ఈ నెల 16 నుంచి 31 వరకు నట్టల నివారణ మందులు పంపిణీ చేయనున్నట్లు స్థానిక ఏరియా పశువైద్యశాఖ సహాయ సంచాలకులు డాక్టర్. కె.ఉషాకుమారి తెలిపారు. గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు వేయడం వలన జీవాలలో వ్యాధి నిరోధక శక్తి పెరిగి పిల్లలలో మరణాల రేటు తగ్గుతుందని, శరీర బరువు పెరుగుదల రేటు కూడా వృద్ధి చెందుతుందన్నారు. మండలంలోని గొర్రెల, మేకల పెంపకందారులందరూ తమ గ్రామ రైతు సేవా కేంద్రంలోని పశు సంవర్ధక సహాయకులను గానీ, పశు వైద్యశాలను గానీ సంప్రదించి జీవాలకు వ్యాక్సినేషన్ చేయించుకోవాలని సూచించారు.

దేవరాపల్లి : ఈ నెల 16 నుండి 31 వరకు దేవరాపల్లి మండలంలో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ వ్యాక్సిన్ వేయనున్నటుల మండల పశువైద్యాధికారి మంజూషా రాణి తెలిపారు. మండలంలో సుమారు 5933 గొర్రెలు, 9760 మేకలు ఉన్నాయని, వాటి పెంపకందారులు విధిగా వ్యాక్సినేషన్ చేయించాలని సూచించారు.

బాల్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి -చోడవరం : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అండర్ 14,17 బాల్ బ్యాడ్మింటన్ పోటీలు గోవాడలో మంగళవారం స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు ఆటపాటల్లోనూ రాణించాలన్నారు.. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో మంది ప్రతిభ ఉన్న క్రీడాకారులున్నారని, వారికి విద్యార్థి దశ నుండే మంచి తర్ఫీదు నందిస్తే భవిష్యత్తులో మంచి క్రీడాకారులుగా రాణిస్తారన్నారు.కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఏడువాక లక్ష్మణ్‌కుమార్, హైస్కూల్ హెచ్ఎం కె.రాము, టిడిపి మండల అధ్యక్షుడు బొడ్డేటి నాగ గంగాధర్, పీడీలు గోతిరెడ్డి రాంబాబు, భాస్కర్ పాల్గొన్నారు.

జిల్లా జట్టుకు 16 మంది క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి -అచ్యుతాపురం : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో గోవాడ హైస్కూల్లో నిర్వహించిన అండర్ 14,17, 19 విభాగాలలో శ్రీరామ బాల్ బ్యాడ్మింటన్ క్లబ్ ప్రాంగణంలో శిక్షణ పొందిన 16 మంది క్రీడాకారులు జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. క్రీడాకారులు ఎంపిక పట్ల క్లబ్ చైర్మన్ ఆర్‌వివి నగేష్ హర్షం తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులను జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గొంపా నరసింహనాయుడు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పెదపూడి శంకర్రావు, క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు మాసవరప అప్పారావు, గారపాటి అప్పలరాజు అభినందించారు.

రాష్ట్రస్థాయి కత్తిసాము పోటీలకు గుణశేఖర్

ప్రజాశక్తి- కశింకోట : స్థానిక డిపిఎన్ పాఠశాల విద్యార్థి గుణశేఖర్ రాష్ట్ర స్థాయి కత్తి సాము పోటీలకు ఎంపికయ్యాడని ఇన్‌ఛార్జి హెచ్ఎం ఆచంట రవి మంగళవారం తెలిపారు గోవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన 68 వ ఎస్‌జిఎఫ్. ఫెన్సింగ్ (కత్తిసాము) పోటీలలో డిపిఎన్. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి అండర్-17, ఫోయిల్ స్టయిల్ విభాగంలో పోటీ పడి సత్తాచాటడం ద్వారా రాష్ట్రస్థాయి పోటీలకు గుణ శేఖర్ ఎంపిక అయ్యాడు . నంద్యాలలో జరగబోవు రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలలో గుణశేఖర్ పాల్గొంటాడన్నారు. ఈ మేరకు గుణశేఖర్‌ను పాఠశాల పిడి.ప్రభాకరరావు, ఉపాధ్యాయులు ఎమ్ఆర్‌వి. అప్పారావు, ఎన్‌జె.వి. ప్రసాద్, ప్రభాకర్, అప్పారావు, పాఠశాల విద్యా కమిటీ చైర్మెన్ నక్కా నాగమణి అభినందించారు.

రామాయణం పోటీల్లో విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి- అనకాపల్లి : తెలుగు భాష పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మంగళవారం రామాయణం పోటీల బహుమతి ప్రదానోత్సవం డాక్టర్ హిమశేఖర్ పాఠశాలలో నిర్వహించారు మావూరి రాంప్రసాద్ ప్రోత్సాహంతో వ్యాస రచన, వక్తృత్వ పోటీలు జరిగాయి. సమితి కన్వీనర్ కొలాడ రామ్మోహన్ అధ్యక్షతన జరిగిన సభలో దోహలో ఎయిర్‌ఫోర్స్‌లో పనిచేస్తున్న రాంప్రసాద్ దుర్గశ్రీ దంపతులు పాల్గొని పోటీల నిర్వహణకు రూ.25వేల ఆర్థికసాయం అందించారు. హిమశేఖర్ విద్యాసంస్థ ల అధినేత, కొణతాల జనార్దన్, పాఠశాల ప్రిన్సిపాల్, సురేష్. తెలుగు భాష పరిరక్షణ సమితి సభ్యులు, మాధవి సనారా, తమ్మిరాజు మాష్టారు, అమరజ్యోతి, మల్లీశ్వరి పాల్గొన్నారు.

నేడు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికలు

ప్రజాశక్తి-దేవరాపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జిల్లాస్థాయి ఫుట్‌బాల్, సెపక్ తక్రా క్రీడాపోటీలకు ఎంపికలు జరుగుతాయని స్థానిక ఎంఇఒ బి పడాల్‌దాస్ తెలిపారు. అండర్ 14 బాలబాలికల విభాగంలో ఫుట్‌బాల్ క్రీడాంశంలోనూ, అండర్-14,అండర్-17 విభాగాల్లో సెపక్ తక్రా క్రీడాంశంలో పోటీలు జరుగుతాయన్నారు. ఆసక్తిగల ఉమ్మడి విశాఖ జిల్లాలోని క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని సూచించారు.

వరల్డ్ రికార్డు పోటీకి సాయిరామ్‌కు ఆహ్వానం

ప్రజాశక్తి - పరవాడ: అంతర్జాతీయ తెలుగు సాహిత్య సాంస్కృతిక అకాడమీ, శ్రీకళావేదిక సంయుక్త ఆధ్వర్యాన డాక్టర్ కత్తిమండ ప్రతాప్ సారథ్యంలో ఈ నెల 19,20 తేదీల్లో పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో బుద్దాల కన్వెన్షన్ హాలులో నిర్వహించే 24 గంటల నిర్విరామ జరిగే ప్రపంచ తెలుగు సాహిత్య కళా జాతర వరల్డ్ రికార్డు వేడుకలో పాల్గొనేందుకు కవి, రచయిత, గాయకులు, సామాజికవేత్త ఎంఎస్ఎస్. సాయిరాం ఆహ్వానం అందుకున్నారు. పరవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా పని చేస్తున్నారు. గతంలో ఎన్నో సామాజిక రచనలు చేశారు. వివిధ సాహితీ ప్రక్రియలు, సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు డాక్టర్. హారిక, డాక్టర్. జయశ్రీ కరిష్మా, అప్తాల్మిక్ ఆఫీసర్ ఆర్.వెంకట్రావు సీనియర్ అసిస్టెంట్ ఆనంద కుమార్, వైద్యసిబ్బంది తదితరులు సాయిరామ్‌కు అభినందనలు తెలిపారు.

అబ్దుల్ కలాంకు ఘననివాళి

ప్రజాశక్తి -యంత్రాంగం

శాస్త్రవేత్త, మాజీ రాష్ట్రపతి ఎపిజె.అబ్దుల్ కలాం జయంతిని విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో పలుచోట్ల మంగళవారం ఘనంగా నిర్వహించారు.

అనకాపల్లి : స్థానిక ఎఎంఎఎల్ కాలేజీలో మంగళవారం భారతరత్న, మాజీ రాష్ట్రపతి, మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా ఎపిజె అబ్దుల్ కలాం 93వ జయంతిని నిర్వహించారు.కళాశాల ఆవరణలోకలాం విగ్రహానికి ప్రిన్సిపాల్ డాక్టర్ గల్లా జయబాబు పూలమాలను వేసి నివాళులు అర్పించారు.కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నిరంజన్ కుమార్, కళాశాల సూపర్ ఇంటెండెంట్ అనురాధ, టీచింగ్ నాన్ టీచింగ్ స్టాఫ్, విద్యార్థులు పాల్గొన్నారు. మామిడిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం శ్రీధర్ ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయ్ మాట్లాడుతూ కలాం పేద స్థితి నుంచి ఎదిగి ఎంతో ఉన్నతమైన రాష్ట్రపతి పదవిని అధిరోహించారన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, బాబు, వసంతరావు, అనీ రోజ్, లక్ష్మి, విజయలక్ష్మి, శైలజ, సుబ్రహ్మణ్యం, శ్రీను, కరుణ జ్యోతి, ఉమ, ప్రసాద్, జి. లక్ష్మి, కామేశ్వరరావు, బాల సరస్వతి పాల్గొన్నారు.

మునగపాక : మండలంలోని వాడ్రపల్లి గ్రామంలో అబ్దుల్ కలాం చిత్రపటానికి ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, పలువురు నేతలు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ జనసేన, టిడిపి, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డైట్‌లో కలాం చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఎం.జ్యోతికుమారి మాట్లాడుతూ, శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా అబ్దుల్ కలాం చేసిన సేవలు చిరస్మరణీయం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఎల్.సుధాకర్, జిజిఎస్.నాగేశ్వరరావు, సిఎ సోమయాజులు, జి రవి పాల్గొన్నారు.

టిడిపి మూడో వార్డు కమిటీ ఆధ్వర్యాన స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలోని కలాం విగ్రహానికి పార్టీ నాయకులు పూల మాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, ఎం.సంజీవ్‌కుమార్, కె.నాగరాజు, కొక్కిరి అప్పన్న, ఎస్.జోగారావు తదితరులు పాల్గొన్నారు.

మామిడిపాలెంలో కలాంకు నివాళులు

మధురవాడ : చంద్రంపాలెం ఉన్నత పాఠశాలలోని అబ్దుల్ కలామ్ విగ్రహానికి భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అబ్దుల్ కలామ్‌ను ప్రతి విద్యార్థీ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఎన్.అప్పారావు, పిళ్లా వెంకటరావు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : టిడిపి విశాఖ జిల్లా కార్యాలయంలో అబ్దుల్ కలాం జయంతిని ఘనంగా నిర్వహించారు. పార్టీ దక్షిణ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సీతంరాజు సుధాకర్, పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు, పార్టీ మైనార్టీ విభాగం అధ్యక్షులు షేక్ రహమతుల్లా, కార్యదర్శి మమ్మద్ గౌస్, మహమ్మద్ జఫరుల్లా, షేక్ బాబ్జి, సలీం, అబ్దుల్ బాషా పాల్గొన్నారు.

కొత్తకోట:రావికమతం మండలం టి.అర్జాపురం క్లస్టర్ సిఆర్పి గుంటూరు రామారావు ఆధ్వ ర్యంలో పాత కొట్నాబిల్లి ప్రాథమిక పాఠశాలలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. కలామ్ చిత్ర పటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచి ఆయన అలోచిన విధానంతో రాష్ట్రపతిగా ఎదిగారని పేర్కొన్నారు. విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు అందించారు.

నక్కపల్లి :మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అధికారులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో డిఎల్‌డిఒ ఉదయశ్రీ, తహసిల్దార్ నరసింహమూర్తి, ఎంపీడీవో డి సీతారామరాజు, డిటి అన్నాజీరావు, ఇన్చార్జి ఈఓపిఆర్డి శ్రీను, ఏపీవో భాగ్యలత, పంచాయతీ కార్యదర్శులు సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర సుజల స్రవంతిపై పాలకుల చిన్నచూపు

ప్రజాశక్తి- కె.కోటపాడు: ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుపై పాలకులు చిన్నచూపు చూస్తున్నారని దీన్ని తక్షణమే పూర్తి చేయాలని ఆంధ్రప్రదేశ్ చెరుకు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేచలపు కాసుబాబు డిమాండ్ చేశారు. మంగళవారం కె.కోటపాడు సిపిఐ కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. సుజల స్రవంతి ప్రాజెక్టు వల్ల ఉత్తరాంధ్రలో 18 నియోజకవర్గాలు , 408 మండలాలకు చెందిన 1200 గ్రామాల్లో సుమారు 30 లక్షల మందికి తాగునీరు, ఎనిమిది లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ఈ ప్రాజెక్టును పాలకులు ఉద్దేశపూర్వకంగానే నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. కృష్ణ గోదావరి డెల్టా ప్రాంతంలో 25 లక్షల ఎకరాలకు రెండు పంటలకు నీరు అందుతుండగా, ఉత్తరాంధ్రలో రెండో పంటకు కేవలం ఏడు శాతం మాత్రమే సాగునీరు అందుతుందన్నారు. ఇదే అంశాలపై వచ్చేనెల 22న అనకాపల్లి రోటరీ హాల్‌లో రైతుల ప్రాంతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు రెడ్డి అప్పలనాయుడు , సిపిఐ మండల కార్యదర్శి గొర్లె దేవుడి బాబు, సన్యాసినాయుడు, సీమసిరి రాము నాయుడు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

హైస్కూల్‌ను సందర్శించిన కార్పొరేటర్

మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న శ్రీనివాస్

ప్రజాశక్తి- పరవాడ: జీవిఎంసి 79వ వార్డు దేశపాత్రునిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌ను స్థానిక కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ సందర్శించారు. స్కూల్లో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం భోజనం రుచి చూసి, ఇంకా నాణ్యత పెంచాలని సిబ్బందిని ఆదేశించారు. పాఠశాలలో విద్యుద్దీపాలు కావాలని హెచ్ఎం కోరారు. కార్పొరేటర్ స్పందించి త్వరలో లైట్లు వేయిస్తానని హామీ ఇచ్చారు. నాడు నేడులో పూర్తయిన బాత్ రూమ్‌లను ఉపయోగించుకోవాలని ఆదేశించారు.

భజన గురువులకు గౌరవ వేతనం ఇవ్వాలి

ప్రజాశక్తి-.అనకాపల్లి :భజన గురువులకు గౌరవ వేతనంగా రూ.పదివేలు ఇవ్వాలని తిరుపతి అన్నమయ్య కళాక్షేత్ర పీఠాధిపతి విజయ శంకర స్వామీజీ అన్నారు. అనకాపల్లి నూకాంబిక ఆలయంలో మంగళవారం విజయ శంకర స్వామీజీ హైందవ భక్తభజన బందాల సమ్మేళనంలో పాల్గొన్నారు. నూకాంబిక ఆలయం సిబ్బంది ఆయనకు ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అనకాపల్లి నూకాంబిక అమ్మవారి ఆలయం, సింహాచలం వరాహ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం, ఋషికొండ వెంకటేశ్వర స్వామి ఆలయం వంటి చోట్ల ప్రతిరోజూ మూడు బృందాలకు భజన, కోలాటం ప్రదర్శించే అవకాశం కల్పించాలని కోరారు.

మోటార్ సైకిల్ వితరణ

మోటార్ సైకిల్ అందజేస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని సంపతిపురం గ్రామానికి చెందిన మురకొండ రత్తయ్యకు జిల్లా కలెక్టరు విజయకృష్ణన్ మంగళవారం మోటారు సైకిలు అందజేసారు. జూలై 11న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లాలో ఎస్. రాయవరం పర్యటనకు వచ్చిన సందర్భంలో మురకొండ రత్తయ్య ముఖ్యమంత్రిని కలిసి మోటారు సైకిలు మంజూరుచేయమని కోరాడు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లా కలెక్టరు స్పందించి లారస్ కంపెనీ సిఎస్ఆర్. నిధులతో మోటారు సైకిల్ సమకూర్చి రత్తయ్యకు అందజేశారు.కార్యక్రమంలో సిపిఒ. జి.రామారావు, లారస్ కంపెనీ హెచ్ఆర్. డి.ప్రదీప్ పాల్గొన్నారు.

ఆదర్శ పంచాయతీగా అభివృద్ధి

ప్రజాశక్తి -మునగపాక: మండలంలోని మూలపేట గ్రామాన్ని ఆదర్శ పంచాయతీగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు తెలిపారు. మంగళవారం గ్రామంలోని మంచినీటి పథకం మోటారు, పైపులైన్ స్థానంలో కొత్తవి ఏర్పాటు పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాల సమస్యల తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ జెఇఇ మానస, కార్యదర్శి గంగాధర్, వార్డు మెంబర్లు కాండ్రేగుల నాని, ఎల్లపు హైమావతి నాయుడు, భీసెట్టి నారాయణమూర్తి, ఎల్లపు నాగేశ్వరరావు, భీశెట్టి వీరునాయుడు, శరగడం నాగేశ్వరరావు, బి శెట్టి వీరి నాయుడు, బీసెట్టి అప్పారావు, ఆడారి చిరంజీవి, పీల శ్రీను, కాండ్రేగుల జగన్నాధరావు, భీశెట్టి త్రినాథ్, సరగడం ఋషి పాల్గొన్నారు

గ్రామ పరిపాలనపై అవగాహన అవసరం

ప్రజాశక్తి- కె.కోటపాడు: గ్రామపంచాయతీల పరిపాలన విధానంపై స్థానిక ప్రజాప్రతినిధులు ముఖ్యంగా సర్పంచ్, వార్డు మెంబర్లు అవగాహన కలిగి ఉండాలని ఎంపిడిఒ సాంబశివరావు కోరారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఆర్‌జిఎస్ఎ కార్యాచరణ ప్రణాళిక, పై గ్రామ పంచాయతీలలో సాధారణ పరిపాలనా విధానం, ఎపిపిఆర్ చట్టం 1994 నిబంధనలు మొదలగు 10 అంశాలపై మండల స్థాయిలో గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్, ఇద్దరు వార్డు సభ్యులకు రెండు రోజుల శిక్షణలో మాట్లాడారు. తొలి బ్యాచ్‌లో 16 గ్రామ పంచాయతీలకు చెందిన ఉపసర్పంచ్‌లు, 32మంది వార్డు సభ్యులు పాల్గొన్నారు.

నూకాంబికను దర్శించుకున్న సినీ నటులు

ప్రజాశక్తి-అనకాపల్లి : నూకంబిక అమ్మవారిని మంగళవారం లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్, ఉందిలే మంచి కాలం ముందు ముందునా చిత్రాల్లో హీరోగా నటించిన సుధాకర్, కంచరపాలెం, టక్ జగదీష్, భామా కలాపం, టైగర్ నాగేశ్వరరావు, కమిటీ కుర్రోళ్లు లో నటించిన కంచరపాలెం కిషోర్, సందర్శించారు. బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మళ్ల సురేంద్ర, దేవస్థాన నిర్వాహకులు దాడి జైవీర్ ఆహ్వానం మేరకు అమ్మవారిని దర్శించుకున్నారు. దాడి జయవీర్ తీర్థప్రసాదాలను అందజేసి, అమ్మవారి చిత్రపటంతో సత్కరించారు.కార్యక్రమంలో మధురవాడ దుర్గా థియేటర్ అధినేత కార్తిక్, ఆంధ్రప్రదేశ్ వెంకటేష్ హెల్పింగ్ హాండ్స్ వ్యవస్థాపకుడు పి. చందు పాల్గొన్నారు.

తహశీల్దార్‌ను కలిసిన వైస్ ఎంపిపి

ప్రజాశక్తి-సబ్బవరం.: స్థానిక మండల తహశీల్దాగా బాధ్యతలు చేపట్టిన బి.చిన్నికృష్ణను మండల వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్ మంగళవారంమర్యాదాపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి దుస్సాలువతో సత్కరించి శు భాకాంక్షలు తెలిపారు.అలాగే మండల విఆర్ఎల సంఘ అధ్యక్షులు ఎన్ గంగాధరరావు, పలువురు విఆర్ఎలు తహసీల్దార్ ను మర్యాద పూర్వకంగా కలిశారు.

పల్లె పండగతో గ్రామాలు అభివృద్ధి

- పలు రకాల పనులకు శంకుస్థాపనలు

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాజు

ప్రజాశక్తి -పద్మనాభం : పద్మనాభం మండలంలోని పలు గ్రామాల్లో పల్లె పండగ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ పథకం నిధులు రూ.45 లక్షలతో మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంగళవారం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు భూమి పూజ చేశారు. రూ.30 లక్షలతో అనంతవరం నుంచి గంధవరం మధ్య గెడ్డపై వంతెన నిర్మాణానికి, పెంట గ్రామంలో రూ.15 లక్షలు సిసి రోడ్ల పనులకు భూమి పూజ చేశారు. అనంతరం రచ్చబండలో గ్రామ సమస్యలపై గ్రామస్తులతో సమీక్ష నిర్వహించారు. సర్పంచ్ బోధల పావని గ్రామంలోని సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎం.విజయ్‌కుమార్, టిడిపి మండల అధ్యక్షులు కె.రమణ, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు కె.దామోదరరావు, లీలావతి, కె.రామస్వామి నాయుడు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని అగ్రహారం వీధిలో పల్లె పండుగలో ఎంపీ సిఎం రమేష్ పాల్గొని, రూ.2.24కోట్లతో సిసి రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. కశింకోటలో రూ.3.88కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు సిఎం రమేష్ వెల్లడించారు. ఈ సందర్భంగా గ్రామంలో కళ్యాణమండపం నిర్మించాలని స్థానికులు విన్నవించారు. దీనిపై ఎంపీ స్పందిస్తూ, ప్రభుత్వం నుంచి కాకపోయినా, పరిశ్రమల సిఎస్ఆర్ నిధులతో కళ్యాణమండపం నిర్మిస్తానని హామీనిచ్చారు. అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద్, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీష్ , ద్వారపురెడ్డి పరమేశ్వర రావు, గ్రామ సర్పంచ్ జయ రజని డ్వామా పిడి పూర్ణిమాదేవి , మండల ప్రత్యేక అధికారి రోజారాణి ఎంపిడిఒ రవికుమార్, తహశీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మునగపాక: మండలంలోని చూచుకొండ, గణపర్తి, మెలిపాక, తిమ్మరాజుపేట, వాడ్రాపల్లి, గొల్లల పాలెం, ఒంపోలు, ఉమ్మలాడ గ్రామాలలో మంగళవారం పల్లె పండుగ ప్రారంభమైంది. సీసీ డ్రైన్లు, రోడ్ల నిర్మాణానికి ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ శంకుస్థాపన చేశారు.కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు దొడ్డి శ్రీనివాసరావు, ఎంపిపి మల్ల జయలక్ష్మి, ఆడారి మంజు, భీమరశెట్టి శ్రీనివాసరావు, దాడి ముసలి నాయుడు పాల్గొన్నారు.

సబ్బవరం: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ అన్నారు. గొట్టివాడ దరి ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో సాలాపు వెంకటేశ్వరరావు అధ్యక్షతన పల్లె పండుగ సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, గొట్టివాడ సర్పంచ్ సాలాపు వెంకటేశ్వరరావు, సర్పంచ్ సాలాపు మీనా, ఎంపిటిసి బోండా శేషుకుమారి సత్యారావు, వైస్ ఎంపిపి శరగడం ఝాన్సీ లక్ష్మీ రాణి రాము, బలిరెడ్డి అప్పారావు, తహసీల్దార్ బి. చిన్నికృష్ణ, ఎంపిడిఒ పద్మజ పాల్గొన్నారు.

అనకాపల్లి : మండలంలోని, కోడూరు, గోపాలపురం, గొలగాం, అక్కిరెడ్డిపాలెం, మారేడుపూడి గ్రామాలలో రోడ్లు, కాలువల నిర్మాణ పనులకు రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్, పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీష్ శంకుస్థాపన చేశారు.కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కొట్టి బాలాజీ, కర్రి బాబీ, భరత్ రాజు, ఎంపిటిసిలు చదరం నాగేశ్వర రావు, నారపిన్ని చంద్ర శేఖర్, బంటు రవి, తలారి కాశీ నాయుడు, కసిరెడ్డి త్రినాథ్, రాకోటి చిన అప్పారావు పాల్గొన్నారు.

కోటవురట్ల:కూటమి ప్రభుత్వంలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి బాటలు వేస్తున్నామని మండల టిడిపి అధ్యక్షులు జానకి శ్రీను అన్నారు. మంగళవారం బికెపల్లి, రామచంద్రపాలెం, నీలు గుంట పంచాయతీలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. బికెపల్లి గ్రామంలో 14.60 లక్షలతో ఐదు పనులు, రామచంద్రపాలెం 6.30 లక్షలతో రోడ్డు కాలువ కల్వర్టు, నీలిగుంట శివారు సన్యాసిరాజుపాలెం గ్రామంలో 4.60 లక్షలతో అభివృద్ధి పనులు ప్రారంభించారు. తహసిల్దార్ తిరుమల బాబు, పిఆర్ ఇంజనీర్ వర్మ, బికెపల్లి సర్పంచ్ లింగన్న నాయుడు, ఎంపీటీసీ సభ్యులు రాంబాబు, సర్పంచ్ పరదేశమ్మ పాల్గొన్నారు.

కొత్తకోట:పల్లె పండుగ కార్యక్రమంతో గ్రామాలను అభివృద్ధి చేసుకోవచ్చునని అనకాపల్లి ఎంపి సిఎం రమేష్, చోడవరం ఎమ్మెల్యే కె.యస్ఎన్ యస్ రాజు అన్నారు. రావికమతం మండలంలో మంగళవారం సుమారు రూ.8.30 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులను వారు ప్రారంభించారు. రావికమతం మండలంలో రావికమతం, టి.అర్జాపురం, కిత్తంపేట, గర్నికం, మరుపాక, గుడ్డిప, చీమలపాడు పంచాయతీ గ్రామాలలో కూటమి నాయకులతో కలిసి పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేసారు. ఉపాధిహామీ పథకం నిధులతో చేపట్టే పనులకు భూమిపూజ చేసారు. ఈ సందర్భంగా ఎంపి రమేష్, ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ గత ప్రభుత్వం పంచాయతీలను పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. గ్రామాలలో డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, మండల టీడీపీ నాయకులు రాజాన కొండనాయుడు, టీడీపీ సీనియర్ నాయకులు కోట గోవిందరావు, మాజీ ఎంపీటీసీ బంటు శ్రీను, రావికమతం సర్పంచ్ మోదినాయుడు, ఎంపీటీసీ నాగేశ్వరరావు సూర్యనారాయణ పాల్గొన్నారు.

16 నుండి పల్లె పండుగ

నక్కపల్లి :మండలంలోని ఈనెల 16వ తేదీ నుండి 19వ తేదీ వరకు పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో డి సీతారామరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో హోం మంత్రి అనిత, ఎంపీ సీఎం రమేష్ పాల్గొంటారన్నారు. 16 న దేవవరం,గొడిచెర్ల, చీడిక, ముకుందరాజుపేట, దోసలపాడు, రేబాక , 17న సిహెచ్ బి అగ్రహారం, న్యాయంపూడి ,కాగిత, చందనాడ, డిఎల్ పురం, 18 నక్కపల్లి, ఉపమాక, రాజయ్యపేట,పెదతీనార్ల, జానకయ్యపేట, 19న చినదొడ్డిగల్లు గ్రామాల్లో పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాలు నిర్వహించ నున్నట్లు వెల్లడించారు.

స్పీకర్ అయ్యన్నపాత్రుడును సత్కరిస్తున్న తాతయ్యబాబు

స్పీకర్‌ను కలిసిన తాతయ్యబాబు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట:రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గా నియమితులైన బత్తుల తాతయ్యబాబు మంగళవారం నర్సీపట్నంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడుని స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడుకి శాలువా కప్పి సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

అయ్యన్నతో ప్రగడ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడును మంగళవారం ఎలమంచిలి టిడిపి ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. అమెరికా పర్యటన, తానా సభలు హాజరై స్వదేశానికి వచ్చిన సందర్భంగా నర్సీపట్నంలో కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు కసరత్తు

ప్రజాశక్తి -కోటవురట్ల:రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మండలంలో సాగునీటి ఎన్నికల ప్రక్రియకు మండల తహసిల్దార్ తిరుమల బాబు దిగువ సిబ్బందికి ఎన్నికల విధి విధానాలపై ఆదేశాలు జారీ చేశారు. రైతుల వివరాలు రైతు సంఘాలు, భూముల, సర్వే నెంబర్ వివరాలు సేకరించాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండల వ్యాప్తంగా ఆరు చిన్న తరహా సంఘాలకు ఎన్నికలు జరపనున్నట్లు వెల్లడించారు. మండల వ్యాప్తంగా ఆరు సంఘాలకు అధ్యక్షులు ఎంపిక జరుగుతుందని తెలిపారు. రాజుపేట చౌడువాడ ఛానల్, కైలాస పట్నం గోవాడ గెడ్డ ఛానల్, లింగాపురం పెద్ద ట్యాంక్, కొండమని కె.వి.పురం ట్యాంకు, కోటవురట్ల, ఊటగెడ్డ గ్రోయన్ బికెపల్లి ఛానల్, సంఘాలకు ఎన్నికలు సజావుగా జరిపించేందుకు సమగ్ర సమాచారం సేకరిస్తున్నామన్నారు. భూ యజమానికి ఓటు హక్కు తప్పక ఉంటుందని భూ యజమాని మరణిస్తే వారి వారసత్వ బంధువులకు ఓటు హక్కు కల్పిస్తామన్నారు. మేజర్ కాలువలు తాండవ, దుర్గాడ ఛానల్ పరిధిలో రైతులను గుర్తిస్తున్నామన్నారు ఈ నెల 16న నోటిఫికేషన్ విడుదల కాగా 20వ తేదీ నాటికి పూర్తి వివరాలు సేకరించి పొందుపరుస్తామని ఈ సందర్భంగా తెలిపారు.

సాగులో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి- నక్కపల్లి:వివిధ పంటల సాగులో చీడపీడలు పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితులలో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని బిసిటి - కృషి విజ్ఞాన కేంద్రం, సస్యరక్షణ శాస్త్రవేత్త, బండి నాగేంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని నక్కపల్లి, పెదదొడ్డిగల్లు గ్రామాల్లో వ్యవసాయ అధికారుల ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. వరి, జీడి మామిడి, కొబ్బరి పంటలలో యాజమాన్య చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. క్షేత్ర సందర్శనలో భాగంగా వరి సాగులో పాముపొడ తెగులు, బ్యాక్టీరియా ఎండాకు తెగుళ్లను గుర్తించి నియంత్రణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. బిసిటి కృషి విజ్ఞాన కేంద్రం, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శైలజ కుర్రా, పశువైద్య శాస్త్రవేత్త డాక్టర్ విజయదుర్గా మాట్లాడుతూ, కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా చేపడుతున్న రైతు సేవా కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం, వ్యవసాయ అధికారిని తులసిమణి, తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

కోటవురట్ల:ఎర్ర తెగులు నివారణకు రైతులు పటాస్ ఎరువులు వాడాలని మండల వ్యవసాయ అధికారి సరోజిని సూచించారు. మంగళవారం కొండపూడి గ్రామంలో ఏర్పాటు చేసిన పొలంబడి కార్యక్రమం ఏర్పాటు చేశారు. పటాస్‌తో గింజ గట్టితనం, దుబ్బు దృఢత్వంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అప్పారావు, ఎంపీటీసీ సభ్యులు సూర్యప్రకాష్, పలువురు రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

వినతిపత్రం ఇస్తున్న సంఘం నాయకులు

కాఫీ కార్మికుల సమస్యలపై స్పందించండి

ప్రజాశక్తి-చింతపల్లి: కాఫీ కార్మికుల సమస్యలపై యాజమాన్యం స్పందించకుంటే సమ్మె తప్పదని కాఫీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు యస్. కనకవల్లి తెలిపారు. కాఫీ కార్మికులు, క్షేత్రస్థాయి సిబ్బందితో కలిసి మంగళవారం ఎపిఎఫ్‌డిసి చింతపల్లి డివిజనల్ మేనేజర్ కార్యాలయంలో డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కాఫీ కార్మిక సంఘం జిల్లా బాధ్యులు గడుతూరి సత్యనారాయణ తో కలిసి సమర్పించారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా రోజువారీ జీవన ప్రమాణానికి ఏపీ ఎఫ్డిసి ఇస్తున్న కూలి సరిపోలేదని తెలిపారు. కాఫీ తోటల సంరక్షణ కోసం యాజమాన్యం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్షేత్రస్థాయి సిబ్బంది, ప్లాంటేషన్ వర్కర్స్, నాగేశ్వరరావు, పాపారావు, రాజారావు, గిరి, శివ పాల్గొన్నారు.

సన్మానిస్తున్న ఐద్వా నాయకులు

కార్యదర్శికి సన్మానం

ప్రజాశక్తి-ముంచంగిపట్టు:మండలంలోని కించాయిపుట్టు గ్రామ పంచాయతీ సచివాలయం కార్యదర్శి గోపికి బదిలీ కావడతో ఐద్వా అధ్యక్షురాలు ఎస్ ఈశ్వరి , కార్యదర్శి ఎస్.విజయలు ఘనంగా సన్మానించారు. మండల వైస్ ఎంపీపీ1 సత్యనారాయణ మాట్లాడుతూ, అంకిత భావంతో ప్రజల పట్ల సచివాలయంలో సేవలు అందించారన్నారు.

ప్రత్యేక శిక్షణతో అభ్యసనంలో మెరుగైన ఫలితాలు

మాట్లాడుతున్న ఎంఇఒ బ్రహ్మాజీ

ప్రజాశక్తి -కొత్తకోట: నిర్దిష్ట అభ్యసన వైకల్యాలు ఉన్న ప్రత్యేక అవసరాల పిల్లలకు ప్రత్యేక తర్ఫీదును ఇవ్వడంతో వారిలో అభ్యసన సమస్యలను అధిగమించవచ్చని మండల విద్యాశాఖ అధికారి -2 బ్రహ్మజీ అన్నారు. రావికమతం మండలం మేడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం రాష్ట్ర సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ అధికారి ఆదేశాల మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వంకాయల రామారావు అధ్యక్షతన డిస్ లెక్సియా ఫర్ వాక్" అనే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిర్దిష్ట అభ్యసన వైకల్యాలు ఉన్న ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ప్రభుత్వం అవసరమైన అన్నిరకాల సేవలు, సదుపాయాలను కల్పించడం జరుగుతుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మి నాయుడు, జగన్నాధ నాయుడు మాట్లాడుతూ, దివ్యాంగుల చట్టం 2016 ప్రకారం ఉన్న 21 రకాల వైకల్యాల్లో నిర్దిష్ట అభ్యసన వైకల్యం అనేది ఒకటన్నారు. ప్రభుత్వం వీరికి మిగిలిన వైకల్యం గల విద్యార్థుల వలె వీరికి కూడా స్కాలర్‌షిప్స్,అలవెన్సులతో పాటు 10వ తరగతి పరీక్షలలో మార్కుల మినహాయింపు కూడా ఇవ్వడం జరుగు తుందన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అధికారులకు సూచనలు ఇస్తున్న అయ్యన్న

సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

-స్పీకర్ అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: స్థానిక స్పీకర్ క్యాంప్ ఆఫీస్‌లో మంగళవారం అధికారులతో సమీక్ష సమావేశాన్ని స్పీకర్ అయ్యన్న పాత్రుడు నిర్వహించారు. పారిశుద్ధ్యం, తాగునీటి సమస్య, వీధి లైట్ల పై అధికారులను అడిగి తెలుసుకున్నారు. మున్సిపాలిటీలో వీధి దీపాలు, పారిశుధ్యం పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశించారు. గబ్బాడ వద్ద ఇసుక స్టాక్ పాయింట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చి త్వరితగతిన ఇవ్వాలని మైన్స్ ఏడిని ఆదేశించారు. ఇసుక విషయంలో దళారులను అరికట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా అందుబాటులోకి తీసుకురావాలని ఆర్డీఓ, ఎమ్మార్వోలకు సూచించారు. నర్సీపట్నం నియోజకవర్గంలో రహదారుల మరమ్మతులకు నిధులు కేటాయించి తక్షణమే పనులు చేపట్టాలని ఆర్ అండ్ బి డిఈకి ఆదేశాలు జారీ చేశారు. నర్సీపట్నం డంపింగ్ యార్డులోని చెత్తను జిందాల్ పవర్ ప్లాంట్‌కు వంద టన్నులు తరలించామని, ఇంకా 200 టన్నులు పంపాల్సి ఉందని మున్సిపల్ కమిషనర్ సురేంద్ర తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీవో వివి రమణ, ఎమ్మార్వో రామారావు, మున్సిపల్ కమిషనర్ సురేంద్ర, మైన్స్ ఏడి శివాజీ, ఆర్ అండ్ బి డిఈ విద్యాసాగర్, తాండవ డిఈ అనురాధ, డూమా పీడీ పూర్ణిమ దేవి పాల్గొన్నారు.

నిరసన చేస్తున్న అధ్యాపకులు

కాంట్రాక్టు లెక్చరర్ల నిరసన

ప్రజాశక్తి -కొత్తకోట:ఎన్నికల కోడ్‌తో నిలిచిన కాంట్రాక్టు లెక్చరర్ల క్రమబద్ధీకరణ ప్రక్రియ వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ కొత్తకోట జూనియర్ కళాశాల వద్ద మంగళవారం కాంట్రాక్టు లెక్చరర్స్ నిరసన చేశారు. ఈ మేరకు పసుపు రంగు రిబ్బన్లు కట్టుకొని విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వం జూనియర్ కళాశాలల కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రాజేష్ మాట్లాడుతూ, జి వో 114ప్రకారం అందరిని రెగ్యులర్ చేయాలన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా తమ సమస్యల పరిస్కారానికి నోచుకోలేదన్నారు. సమస్యలు పరిస్కారం అయ్యేవరకు దశలవారీగా పోరాటం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంట్రాక్టు అధ్యాపకులు పాల్గొన్నారు.

మండల సమావేశంలో వాగ్వాదం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: మండల ప్రజాపరిషత్ సమావేశం మంగళవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ సుర్ల రాజేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇరు వర్గాల సర్పంచ్ల మధ్య స్వల్ప వాగ్వివాదం చోటు చేసుకుంది. జడ్పిటిసి సుకల రమణమ్మ మాట్లాడుతూ, స్పీకర్ అయ్యన్నపాత్రుడు నర్సీపట్నం మండలానికి రూ.5.65 కోట్లను మంజూరు చేశారని, ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిధులతో రోడ్లు, డ్రైన్లు, శ్మశాన వాటికల అభివృద్ధి చేయాలని ఆయన ఆదేశాలు ఇచ్చారని రమణమ్మ తెలిపారు. ఐసిడిఎస్ పిఓ మేరీ సువార్త మాట్లాడుతూ, ప్రభుత్వం అంగన్వాడీ సెంటర్లకు ఎల్ఇడి టీవీలు, బెంచీలు, కుర్చీలు, మినరల్ వాటర్ సదుపాయం కల్పించడం జరిగిందని తెలిపారు. ఎంపీటీసీ బోలెం రాంప్రసాద్ మాట్లాడుతూ, రైతులకు పొటాషియం సప్లై చేయలేదని తెలిపారు. ఈ సమావేశానికి పూర్తిస్థాయిలో అధికారులు పాల్గొనక పోవడం గమనార్హం. దీనిపై కొందరు సర్పంచులు ఎందుకు అధికారులు అందరూ పాల్గొనలేదని నిలదీశారు. ధర్మసాగరం సర్పంచ్ కన్నయ్య నాయుడు మాట్లాడుతూ ఇప్పటివరకు తల్లికి వందనం పథకం ఎందుకు ఇవ్వలేదని, పాఠశాలల ప్రారంభమై ఐదు నెలలు కావస్తున్నా నేటికీ పథకం లబ్ధిదారులకు ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. దీనికి గబ్బాడ సర్పంచ్ ఈర్లి రాజేశ్వరి గతంలో మీరు ఎప్పుడు పథకాలు ప్రజలకు అందించారో తెలుసుకోవాలని అనడంతో ఇద్దరి మధ్య స్వల్ప వాగ్వివాదం జరిగింది. ఎంపీటీసీ బోలెం రాం ప్రసాద్ వారిద్దరిని సర్ది చెప్పడానికి ప్రయత్నించారు. జెడ్పీటీసీ, ఎంపీపీ రాజేశ్వరి జోక్యంతో శాంతించారు. ధర్మసాగరం సర్పంచ్ కన్నయ్యనాయుడు దురంధరపాలెం సర్పంచ్ సేనాపతి వెంకటరత్నం లు మాట్లాడుతూ, అభివృద్ధి కార్యక్రమాల్లో పార్టీలను చూడకుండా ప్రతి ఒక్కరిని కలుపుకు వెళ్లాలని అనడంతో గతంలో మీరు ఎదుకు కలుపుకోలేదని గబ్బడ సర్పంచ్ ఈర్ల రాజేశ్వరి నిలదీశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఉషాశ్రీ, సర్పంచులు, అధికారులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పిటిసి రమణమ్మ

ఉప్పటేరులో నీరు తాగి ఆవు మృతి

ఆవేదన వ్యక్తం చేస్తున్న పాడి రైతు, మత్స్యకారులు

ప్రజాశక్తి- నక్కపల్లి:మండలంలోని రాజయ్యపేట ఉప్పుటేరులో నీరు తాగి ఆవు మృతి చెందినట్లు పాడి రైతు మైలపల్లి గంగమ్మ ఆవేదన వ్యక్తం చేసింది. తన ఆవు సోమవారం సాయంత్రం ఉప్పుటేరులో నీరు తాగిందని, రాత్రి అస్వస్థకు గురై మృతి చెందిందని ఆవేదన వెలిబుచ్చింది. సుమారుగా లక్ష రూపాయల విలువైన పాడి ఆవు మృతి చెందడంతో తన జీవనోపాధి పోయిందని ఆవేదన చెందింది. హెటిరో కంపెనీ వ్యర్థ రసాయన జలాలు శుద్ధి చేయకుండా ఉప్పుటేరులో వదలడంతోనే తన ఆవు మృతి చెందిందని విలపించింది. తనకు నష్టపరిహారం చెల్లించాలని కోరింది. గ్రామానికి చెందిన పలువురు మత్స్యకారులు మాట్లాడుతూ గతంలో పిక్కి ఏడుకొండల కు చెందిన 3 ఆవులు, రాజుకు చెందిన 3 గేదెలు ఇదేవిధంగా మృత్యువాత పడ్డాయన్నారు.

మాట్లాడుతున్న డిఎల్‌డిఒ

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి -నక్కపల్లి:గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని డిఎల్‌డిఓ ఉదయశ్రీ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సీతారామరాజు ఆధ్వర్యంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, మండల ఇంజనీరింగ్, ఎన్ఆర్ఈజీఎస్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. వాటర్ ట్యాంక్ క్లీనింగ్, చెత్త సంపద కేంద్రాల నిర్వహణ, చెత్త సేకరణ, క్లోరినేషన్ తదితర వాటిపై సమీక్ష చేశారు.

నేడు పిఎసిఎస్ మహాజన సభ

ప్రజాశక్తి- చీడికాడ: మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మహాజన సభను ఈనెల 16న రామకోవెల వద్ద నిర్వహిస్తున్నట్లు సీఈఓ వరహాల దొర తెలిపారు. ఈ సమావేశానికి రైతు ఖాతాదారులు హాజరవ్వాలని ఆయన కోరారు.

52వ వార్డులో డిప్యూటీ మేయర్ జియ్యాని పర్యటన

ప్రజాశక్తి -కరాస: జివిఎంసి 52వ వార్డు పరిధి కరాస హిందూ - ముస్లిం - క్రైస్తవ శ్మశాన వాటికలో అధికారులతో కలసి జివిఎంసి డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ మంగళవారం పర్యటించారు. శ్మశాన వాటికలో పనులను పరిశీలించారు. 3 శ్మశాన వాటికలను సుందరంగా, అధునాతన పద్ధతిలో అదనపు సౌకర్యాలతో నిర్మించే ప్రణాళికను ఆయా మతపెద్దలకు వివరించారు. యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని అధికారులను శ్రీధర్ కోరారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ విభాగం ఎఇ ఉషారాణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, పారిశుధ్య విభాగం అధికారి మూర్తి, సచివాలయం ఉద్యోగులు గణేష్, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శాస్త్రవేత్త శైలజ

వ్యవసాయ పనుల్లో మహిళలే కీలకం

ప్రజాశక్తి -నక్కపల్లి:వ్యవసాయ పనులలో మహిళల ప్రాధాన్యతే కీలకమని బిసిటి - కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శైలజ కర్రా అన్నారు. మండలంలోని పెదదొడ్డిగల్లు గ్రామంలో మంగళవారం బిసిటి - కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మహిళ రైతు దినోత్సవం (మహిళా కిసాన్ దివస్) నిర్వహించారు.మహిళా రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. వ్యవసాయాధికారి ఉమా ప్రసాద్ మాట్లాడుతూ, సామాజిక, ఆర్థిక భాగస్వామ్యం కల్పించడంతోనే మహిళా సాధికారత అని అన్నారు.

బిసిటీ కృషి విజ్ఞాన కేంద్రం, పశువైద్య శాస్త్రవేత్త డాక్టర్ విజయర్ణా, సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్రప్రసాద్ మాట్లాడారు. ఆదర్శ మహిళ రైతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భర్త నాగ అప్పలరాజు, జిల్లా వనరుల కేంద్రం, వ్యవసాయ అధికారి తులసిమణి, గ్రామ వ్యవసాయ సహాయకులు లావణ్య, రాజేష్, వ్యవసాయ విస్తరణ అధికారి సత్యనారాయణ పాల్గొన్నారు.

మద్యం షాపులు దక్కించుకున్నది వీరే...

ఆనందపురం : ఆనందపురం మండలంలోని 26 పంచాయతీల్లో 8 మద్యం షాపులు కేటాయించారు. శిర్లపాలెం, చందక, బోయపాలెం, శొంఠ్యాం, గండిగుండం గ్రామాలలో ఒక్కొక్కటి, వేములవలసలో 2 షాపులను లాటరీలో కేటాయించారు. రెడ్డి కృష్ణనాయుడు, కొల్ల రాంబాబు, ద్వారపూడి సత్య వరప్రసాద్‌రెడ్డి, బెహరా భాస్కరరావు, దీప్తి లతాసమాల్, సోమిరెడ్డి వెంకటేశ్వరస్వామి, మీసాల రామ్మోహన్‌రావు, పల్లా సన్యాసినాయుడు లాటరీలో మద్యం షాపులు దక్కించుకున్నారు. వేములవలస జంక్షన్ పరిధిలో రూ.85 లక్షలు, మండలంలోని మిగతా ప్రాంతాల్లో ఏడాదికి రూ.65 లక్షలు కట్టాల్సి ఉంటుందని ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

పద్మనాభం : పద్మనాభం మండలంలో ఏడు షాపులకు 352 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ శాఖ ఎస్ఐ అనిల్ కుమార్ మంగళవారం తెలిపారు. ఏడు షాపులను లాటరీ ద్వారా గుల్లపల్లి వెంకుబాబు, మనోజ్ రాణి, పోతిన నాయుడు, పి.రవికుమార్, మరిచర్ల సురేష్‌కుమార్, దేవరాజుల ధర, అంజలి అగర్వాల్ దక్కించుకున్నారని తెలిపారు.

కోటవురట్ల:ఏపీలో కొత్త మద్యం విధానానికి ప్రభుత్వం అనుసరించిన పద్ధతిలో బుధవారం నుండి కొత్త మద్యం షాపులు ఏర్పాటు కానున్నాయి. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ సర్కిల్ ఇన్స్పెక్టర్ సునీల్ కుమార్ మండలంలో పర్యటించిన సందర్భంగా స్థానిక విలేకరులకు ఇచ్చిన వివరాల ప్రకారం.... మండలానికి నాలుగు మద్యం దుకాణాలు లాటరీ ప్రక్రియ ద్వారా ఎంపిక చేసినట్లు తెలిపారు. సింగంపల్లి ఏరుకు నాయుడు, బాలన్ శ్రీనివాస్, అయ్యప్ప రెడ్డి సన్యాసమ్మ, సత్తినేని విజయ్ కుమార్‌కు లాటరీ పద్ధతిలో మద్యం అమ్ముకునే విధంగా షాపులు ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు.సర్కిల్ పరిధిలో 546 దరఖాస్తులు అందగా 10.92 కోట్లు దరఖాస్తుల రూపేనా ఆదాయం వచ్చిందని, మండల వ్యాప్తంగా 99 దరఖాస్తులు అందాయని వీటి ద్వారా 1.42 కోట్లు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. లాటరీలో గెలుపొందిన దుకాణదారులు ఆరు విడతల్లో లైసెన్స్ ఫీజు చెల్లించాలన్నారు. దేవాలయాలు, మసీదులు, చర్చిలు, సహ ప్రభుత్వ ప్రాంతానికి వంద మీటర్ల దూరంలో షాపులకు అనుమతి మంజూరు చేస్తామన్నారు.లాటరీలో గెలుపొందిన దుకాణదారులు మండలంలో ఎక్కడైనా షాపు ఏర్పాటుకు అనుమతి మంజూరు చేస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.